TGTEL/25/A0827

# ప్రజా దివాస్

తెలుగు దినపత్రిక

prajadivvs57@gmail.com

**విలేఖరులు కావలెను**

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా..? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా...? అయితే రండి... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

సెల్ : 9440060406

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టర్‌లు కావలెను...

సంపుటి : 3 సంచిక : 146 | బుధవారం 20-05-2026 | ఎడిటర్: ఎస్ ఎన్ డి మౌనిక రవికుమార్ | పేజీలు : 8 వెల 3 /-

## ఆ శునకాల కారుణ్య మరణానికి అనుమతి: సుప్రీం కీలక ఆదేశాలు



జనసమ్మర్ద ప్రాంతాల నుంచి వీధి కుక్కలను తరలించాలంటూ గతంలో ఇచ్చిన ఆదేశాలను మార్చాలని కోరుతూ సుప్రీంకోర్టుకు పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిని పరిశీలించిన అత్యున్నత న్యాయస్థానం ఆ అభ్యర్థనలను తోసిపుచ్చింది. గత ఆదేశాలను మార్చేందుకు తిరస్కరించింది. పాఠశాలలు, ఆసుపత్రులు వంటి బహిరంగ ప్రదేశాల నుంచి తరలించిన శునకాలను తిరిగి ఆ ప్రాంతాల్లో వదిలేయొద్దని స్పష్టం చేసింది. వాటి సంతానోత్పత్తిని నియంత్రించేందుకు, ప్రజలకు భద్రత కల్పించడంపైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పలు ఆదేశాలు జారీ చేసింది.

2లో..

## తీవ్ర ఆర్థిక సంక్షోభం రాబోతోంది: రాహుల్ గాంధీ



దేశ ఆర్థిక వ్యవస్థకు సంబంధించి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. మున్ముందు చాలా కష్టకాలం రానుందని చెప్పిన ఆయన.. చాలా సంవత్సరాలుగా చూడని తీవ్ర ఆర్థిక సంక్షోభం రాబోతోందన్నారు. అదానీ, అంబానీ వంటి వారిపై ఇది ఎటువంటి ప్రభావం చూపదని.. దేశ యువత, రైతులు, చిన్న వ్యాపారులపైనే తీవ్ర ప్రభావం చూపిస్తుందన్నారు.రెండు రోజుల పర్యటనలో భాగంగా తన సొంత నియోజకవర్గం రాయ్‌బరేలీకి చేరుకున్న రాహుల్.. అక్కడ మీడియాతో మాట్లాడారు. పొదుపు చర్యలకు పిలుపునిచ్చిన ప్రధాని మోదీ వాటిని ఆయన మాత్రం పాటించడం లేదని విమర్శించారు. విదేశాలకు వెళ్లవద్దని చెబుతూ.. ప్రపంచ పర్యటనలు చేస్తున్నారన్నారు.

2లో..



## ఏపీలో వెయ్యి మినీ మార్టులు ఏర్పాటు చేస్తాం: మంత్రి నాదెండ్ల మనోహర్

ఢిల్లీ: రాబోయే రోజుల్లో ఏపీలో వెయ్యి మినీ మార్టులు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రెండో రోజు ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, ఉన్నతాధికారులతో ఆయన సమావేశమయ్యారు.

2లో

## తిరుమలలో భవనంపై నుంచి పడి కార్మికుడి మృతి



తిరుమల: మూడంతస్తుల భవనంపై నుంచి పడి కార్మికుడు మృతి చెందిన ఘటన తిరుమలలో చోటు చేసుకుంది.

2లో

## తెలంగాణలో శాస్త్రీయంగా వ్యర్థాల నిర్వహణ

### సుస్థిర పట్టణాభివృద్ధి, సర్క్యులర్ ఎకానమీ దిశగా చర్యలు




**పక్కాగా ఘన వ్యర్థాల నిర్వహణ కార్యక్రమం**
**బయో ఎరువులు, విద్యుత్ ఉత్పత్తికి ప్రాధాన్యం**
**స్వచ్ఛ భారత్ మిషన్ జాతీయ సమీక్ష సమావేశంలో భట్టి**

తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన తెలంగాణ విజన్-2047 లక్ష్యాలకు అనుగుణంగా భవిష్యత్ అవసరాలకు సరిపోయే విధంగా, సుస్థిరంగా, సమగ్రంగా, పర్యావరణహితంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి దిశగా ప్రభుత్వం క్యూర్, ప్యూర్, రేర్ అభివృద్ధి విధానాన్ని అనుసరిస్తోందని, ఇందులో కోర్ అర్బన్ రీజియన్, పెరి అర్బన్ రీజియన్, రూరల్ అగ్రికల్చరల్ రీజియన్‌ల సమతుల్య అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. ఘన వ్యర్థాల నిర్వహణ అనేది ఇకపై కేవలం చెత్త సేకరణకు పరిమితం కాదని, అది వాతావరణ మార్పులకు ప్రతిస్పందన, పర్యావరణ సుస్థిరత, సర్క్యులర్ ఎకానమీ, ఉపాధి కల్పన, ఆర్థిక ఉత్పాదకతలతో నేరుగా అనుసంధానమై ఉందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా పట్టణ పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో మంగళవారం కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ అధ్యక్షతన ప్రారంభమైన రెండు రోజుల 'స్వచ్ఛ భారత్ మిషన్-అర్బన్ 2.0' జాతీయ సమీక్ష సమావేశానికి తెలంగాణ రాష్ట్రం తరపున ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు హాజరయ్యారు. మొదటి రోజు సమావేశంలో దేశంలోని పట్టణ ప్రాంతాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, ఇంటింటి చెత్త సేకరణ, వ్యర్థాల శాస్త్రీయ ప్రాసెసింగ్, పాత చెత్త కుప్పల తొలగింపు, వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి, పీపీపీ విధానాలు, కొత్త ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనల అమలు వంటి అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. రాష్ట్రాలు, నగరాలు అమలు చేస్తున్న అనుభవాలు, ఉత్తమ విధానాలను పరస్పరం పంచుకోవడంపై కూడా సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణ విధానాలు, సుస్థిర పట్టణాభివృద్ధి చర్యలు, స్వచ్ఛత కార్యక్రమాలు, సర్క్యులర్ ఎకానమీ దిశగా చేపడుతున్న కార్యక్రమాలను ఉప ముఖ్యమంత్రి సమావేశంలో వివరించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకు వచ్చిన ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు-2026 దేశంలో వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలో కీలక మార్పుకు దారితీస్తున్నాయని తెలిపారు.

2లో..

## 'నీట్'పై ధర్మేంద్ర ప్రధాన్ ఉన్నతస్థాయి సమీక్ష



- రీ-నీట్ పరీక్షపై కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఉన్నతస్థాయి సమీక్ష
- కట్టుదిట్టమైన భద్రత, ప్రోటోకాల్‌తో పరీక్ష నిర్వహించాలని అధికారులకు ఆదేశం
- పరీక్షలో పారదర్శకత, సమగ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచన
- గత పరీక్షలో గుర్తించిన లోపాలను సరిదిద్దాలని ఆదేశాలు
- కలెక్టర్లు, ఎస్పీలతో సమన్వయ సమావేశాలు నిర్వహించాలని సూచన
- పరీక్షా కేంద్రాల వద్ద భద్రతపై రాజీ పడొద్దని హెచ్చరిక

2లో

## పాలమూరు-రంగారెడ్డిని బీఆర్ఎస్ నిర్లక్ష్యం చేసింది: మంత్రి జూపల్లి

- పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాప్యం లేకుండా నిధులు కేటాయిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ
- ప్రాజెక్టును 90% పూర్తిచేశామని బీఆర్ఎస్ చెప్పడం దారుణమని మంత్రి జూపల్లి వ్యాఖ్య



2లో

## ఆ పిటిషన్లను విచారిస్తాం: సుప్రీంకోర్టు



- హిందూ దేవాలయాలపై రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణ అంశంపై పిటిషన్లను విచారించనున్న సుప్రీంకోర్టు
- ఏపీ, తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరి చట్టాల రాజ్యాంగబద్ధతపై సవాల్
- గతంలో హైకోర్టులను ఆశ్రయించాలని ఇచ్చిన ఆదేశాలను ఉపసంహరించిన సుప్రీంకోర్టు
- గతేడాది ఏప్రిల్‌లో ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకున్న జస్టిస్ బీవీ నాగరత్న ధర్మాసనం
- దేవాలయాల నిర్వహణపై రాష్ట్ర నియంత్రణ చెల్లుబాటు అంశంపై విచారణ
- కమిషనర్ల అధికారాలు, ట్రస్టీల నియామకాలపై పిటిషన్లలో అభ్యంతరాలు

2లో

## కౌండిన్య స్టడీ సర్కిల్స్, ఫంక్షన్ హాళ్లు ఏర్పాటు చేస్తాం

- గౌడ కులస్తులు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలి
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి
- పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి కృషి చేయాలి
- గీత కార్మికులకు ఆర్థిక భద్రత కల్పించాలి
- ప్రమాద బారిన పడిన కుటుంబాలను ఆదుకోవాలి



**నెల్లూరు నగరం, మే 19 (సదా మీకోసం):** నెల్లూరు నగరంలోని కిసాన్ నగర్ వద్ద ఉన్న సాయి గెస్ట్ హౌస్ నందు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్, రాజ్యసభ సభ్యులు పాక సత్యనారాయణను నెల్లూరు జిల్లా గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు తిరకాల సీనయ్య గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు పాక సత్యనారాయణ మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో అన్ని నియోజకవర్గాలలో వేలాదిగా ఉన్న గౌడ కులస్తులు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

2లో..

## తెలంగాణ విజ్ఞప్తి మేరకు.. కేఆర్ఎంబీ సమావేశం మరోమారు వాయిదా




2లో



## డిజిటలైజేషన్‌తో మారుతున్న జర్నలిజం

- ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి
- ఆధునికి సాంకేతికతపై జర్నలిస్టులకు శిక్షణ
- మీడియా అకాడమీ చర్చలో సీనియర్ జర్నలిస్టుల వెల్లడి

నేటి డిజిటల్ యుగంలో జర్నలిజం రంగం వేగంగా మారుతున్న నేపథ్యంలో మీడియా వృత్తిదారులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ముందుకు సాగాలని పలువురు సీనియర్ జర్నలిస్టులు అభిప్రాయపడ్డారు. తెలంగాణ, మీడియా అకాడమీ,

2లో..

# సంపాదకీయం

## ప్రజాస్వామ్యమా, రాజకీయ మాయా?

ప్రపంచ రాజకీయ చరిత్రలో 'ప్రజాస్వామ్యం' అనే పదానికి వచ్చినంత పవిత్రత మరే రాజకీయ సిద్ధాంతానికీ రాలేదు. వర్తమాన ప్రపంచంలో ప్రతి ప్రభుత్వం తనను 'ప్రజాస్వామ్య' ప్రభుత్వంగానే ప్రకటించుకుంటోంది. ప్రతి యుద్ధం, ప్రతి ఆర్థిక విధానం, ప్రతి చట్టం-- ప్రజాస్వామ్యం పేరుతోనే సాగుతున్నాయి. ఇరాన్ మీద యుద్ధానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాడిన రాజకీయ ఆయుధం 'పాలనమార్పు' (=వస్త్రఅవెవ ఎష్టుఅస్త్రవ). అంటే, ఇరాన్‌లో నియంతృత్వాన్ని అంతంచేసి ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పుతామని నమ్మబలికాడు. ఆ మంత్రం ప్రభావవంతంగా పనిచేసింది. ఆ దెబ్బకు ఇరాన్ మీద అమెరికా--ఇజ్రాయెల్‌ల జంటదాడిని ఖండించడానికి కూడ అనేక దేశాలు జంకాయి. ప్రజాస్వామ్యాన్ని రక్షిస్తామంటే హజార్ ఖూన్ మాఫ్! కానీ, అత్యంత ముఖ్యమైన ప్రశ్న ఇక్కడే ఎదురవుతుంది. ప్రజాస్వామ్యం నిజంగా ప్రజల పాలనేనా? లేక ప్రజల పేరుతో నడిచే ఇతరుల అధికార వ్యవస్థనా?

మార్క్సిస్టులకు సాంప్రదాయంగా ప్రజాస్వామ్యం మీద ఎలాగూ నమ్మకం వుండదు. పెట్టుబడీదారీ వ్యవస్థ తనకు అనుకూలమైన పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను రూపొందించుకుందన్నారు కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఏంగిల్స్ ముక్తకంఠంతో. అంచేత వాళ్ళ మీద ప్రజాస్వామ్య మంత్రం ప్రభావం చూపదు.

రెండవ ప్రపంచ యుద్ధం తరువాత, ముఖ్యంగా ముస్సోలినీ -- హిట్లర్ల ఫాసిస్టు, నాజీయిస్టు నియంతృత్వాలను చూసిన తరువాత ప్రపంచ వ్యాప్తంగా ప్రజాస్వామ్యం మీద వ్యామోహం ప్రమాదకరంగా పెరిగింది. ఈ 'పవిత్ర మాయాజాలా'న్ని ఛేధించడానికి ప్రయత్నించినవాళ్లలో ప్రముఖ రాజనీతి శాస్త్రజ్ఞుడు జాన్ డన్ ఒకడు. 'ప్రజాస్వామ్యపు మాయజాలం ఛేదింపు' అనే పుస్తకంలో అనేక దేశాల్లో క్రూరమైన నియంతృత్వమే ప్రజాస్వామ్యం ముసుగులో కొనసాగుతున్న తీరును అతను విశ్లేషించాడు.

అనేక దేశాల్లో క్రమం తప్పకుండా ఎన్నికలు జరుగుతున్నాయి. చట్టసభలు నడుస్తున్నాయి. అనేక చట్టాలు మెజారిటీ సభ్యుల ఆమోదం పొందుతున్నాయి. ప్రతిపక్షాలు కూడా సభలు సమావేశాలు నిర్వహించి తమ విధానాలను ప్రకటిస్తున్నాయి, అధికార పార్టీలను ఘాటుగా విమర్శిస్తున్నాయి. ఎన్నికల్లో కొన్నిచోట్ల అధికార పార్టీ ఓటమిపాలై ప్రతిపక్ష పార్టీ అధికారాన్ని చేపడుతోంది. ఇన్ని జరిగినా, ప్రజాస్వామ్యానికి నిఘంటువుల్లో అర్థం చెప్పినట్టు సమాజంలో జరుగుతోందా? తమ జీవితాలను తాము అనుకున్నట్టు మార్చుకునే అధికారం నిజంగా ప్రజల చేతుల్లో ఉంటోందా?

జాన్ డన్ వాదన ప్రకారం ప్రజాస్వామ్యం ఇప్పుడు ఒక రాజకీయ మత్తుమందుగా మారిపోయింది. ఎన్నికలు జరుగుతున్నాయనే కారణంతో ప్రజలు తమకు అధికారం ఉందని భావిస్తున్నారు. కానీ అసలు అధికార నిర్మాణాలు మాత్రం కార్పొరేట్ శక్తులు, మీడియా సామ్రాజ్యాలు, అంతర్జాతీయ పెట్టుబడి, భద్రతా వ్యవస్థల చేతుల్లోకి జారిపోతున్నాయి. ఇదే ఆధునిక పార్లమెంటరీ ప్రజాస్వామ్యపు అంతర్గత విషాదం.

భారత రాజకీయ వ్యవస్థను గమనిస్తే ఈ వైరుధ్యాలు ఇంకా స్పష్టంగా కనిపిస్తాయి. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్యంగా భారత్‌ను చాలామంది ప్రశంసిస్తారు. 2024లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 64 కోట్లమంది ఓటింగులో పాల్గొన్నారు. వీరిలో 31 కోట్లమంది మహిళలు. ఈ అంకెల్ని చూస్తే ప్రపంచం నివ్వెరపోవాల్సిందే. అయితే, కులాధిపత్యం, ధన ప్రభావం, ఎన్నికల అవినీతి, మీడియా మానిప్యులేషన్, రాజకీయ నేరీకరణ, రాజకీయ మతీకరణ వగయిరాలన్నీ కలిసి ప్రజాస్వామ్యాన్ని కాపాడుతున్నాయంటే అతిశయోక్తి కాదు. 'సామాజిక ప్రజాస్వామ్యం లేకుండా రాజకీయ ప్రజాస్వామ్యం నిలబడదు' అని బీఆర్ అంబేడ్కర్ చాలాసార్లు హెచ్చరించారు. ఇటీవల ఐదు రాష్ట్రాల్లోని 824 శాసనసభ నియోజకవర్గాల్లో ఎన్నికలు జరిగాయి. కేంద్రంలో అధికారంలో వున్న పార్టీ వీటిల్లో ఒక్క సీటు కూడా ముస్లింలకు కేటాయించలేదు. సాక్షాత్తు ప్రధానమంత్రి స్థాయి నాయకులు ముస్లిం వ్యతిరేక ప్రచారాన్ని సాగించి హిందూ ఓట్లను ఆకర్షించడానికి ప్రయత్నించారు. బీజేపీకి ఓటు వేయనివారినీ, విపక్షాలకు మద్దతు తెలిపేవారినీ ఎన్నికల సంఘం ఏకంగా ఓటర్ల జాబితా నుండి తొలగించిందని విపక్షాలు అనేకసార్లు ఆరోపణలు చేశాయి. ఆ ఆరోపణలకు తగినట్టుగా, నిన్నటివరకు వెస్ట్ బెంగాల్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌గా పనిచేసిన మనోజ్‌కుమార్ అగర్వాల్‌ను ఆ రాష్ట్రానికి చీఫ్ సెక్రటరీగా నియమించారు. ఆ రాష్ట్రానికి స్పెషల్ ఎలక్షన్ ఆబ్జర్వర్‌గా వున్న డాక్టర్ సుబ్రతా గుప్తాను ముఖ్యమంత్రికి ముఖ్య సలహాదారుగా నియమించారు.

యుక్త వయస్సు వచ్చిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు, ప్రతి ఓటుకూ సమాన విలువ అని రాజ్యాంగం అంటే చాలామంది చాలాకాలం మైమరచిపోయారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం సమాన ఓటు హక్కు ఇవ్వగలదు, కానీ సమాన శక్తి ఇవ్వదు అని తెలుసుకోవడానికి చాలా కాలం పట్టింది. ఈ హెచ్చరిక ఇప్పుడు మరింత సత్యంగా కనిపిస్తోంది. ఎన్నికల ప్రజాస్వామ్యం కొనసాగుతోంది. కానీ సామాజిక అసమానతలు మరింత బలపడుతున్నాయి. రాజకీయ పార్టీలు ప్రజా ఉద్యమాల కంటే ఎన్నికల యంత్రాలుగా మారుతున్నాయి. పౌరులు క్రమంగా ఓటు బ్యాంకులుగా, డేటా యూనిట్లుగా మారుతున్నారు.

ఇక పార్లమెంటరీ ప్రజాస్వామ్యం నిజంగా ప్రజల సంకల్పాన్ని ప్రతిబింబిస్తుందా? అనే ప్రశ్న కీలకమైనది. ప్రజలు ఐదేళ్లకోసారి ఓటు వేస్తారు. కానీ ఆ తర్వాత జరిగే వేలాది నిర్ణయాలన్నీ కార్పొరేట్ల అవసరాలు, లాబీయింగ్, రహస్య ఒప్పందాలు, అంతర్జాతీయ ఆర్థిక సంస్థల ఒత్తిళ్ళు, మీడియా ప్రచార యుద్ధాలు, రాజ్యాంగ వ్యవస్థల కుమ్మక్కు వగయిరాల ఆధారంగా రూపుదిద్దుకుంటాయి. వీటికి అంతిమంగా 'ప్రజాస్వామ్య నిర్ణయం' అనే ముద్ర వేస్తే చాలు అది పవిత్రం అయిపోతుంది. ఇది ప్రజాస్వామ్యమా? లేక ప్రజాస్వామ్యం పేరుతో నడిచే వ్యవస్థీకృత రాజకీయ మాయా?.

ఎన్నికైన ప్రభుత్వాలు తీసుకున్న ప్రతి నిర్ణయం ప్రజల నిర్ణయమని భావించడం ఎంత ప్రమాదకరమో ప్రపంచం ఇరాక్ యుద్ధంలో చూసింది. ప్రజాస్వామ్య దేశాలుగా చెప్పుకునే అమెరికా, బ్రిటన్ ప్రభుత్వాలు తమ దేశంలో కోట్లాది ప్రజలు వ్యతిరేకిస్తున్నా పట్టించుకోకుండా యుద్ధం ప్రారంభించాయి. ఇరాక్‌లో 'వెపన్స్ ఆఫ్ మాస్ డిస్ట్రక్షన్' (ఔవీఐ) వున్నాయంటూ ఆ దేశంలోకి ప్రవేశించాయి. సద్దాం హుస్సేన్ చనిపోయినా ఆ జీవరసాయన వెపన్స్ ఆఫ్ మాస్ డిస్ట్రక్షన్ జాడ కనిపించలేదు. ఇప్పుడు ఇరాన్ మీద దాడికీ అలాంటి నెపం ఒకటి వేశారు-- ఇరాన్ అణ్వాయుధాలను తయారు చేస్తున్నదని. యుద్ధం మొదలై 80 రోజులైనా ఎవరికీ వాటి జాడ కనిపించలేదు. ఈ యుద్ధానికి అమెరికా పౌరుల మద్దతువుందా? అదీ అనుమానమే. అయినప్పటికీ అమెరికాను గొప్ప ప్రజాస్వామిక దేశం అంటున్నారు. ఇక్కడే పార్లమెంటరీ ప్రజాస్వామ్యపు అసలు సంక్షోభం బయటపడుతుంది. ప్రజలు ప్రభుత్వాన్ని ఎన్నుకుంటారు. కానీ ప్రభుత్వాలపై ప్రభావం చూపేది ఎవరు-- సాధారణ పౌరులా? లేక కార్పొరేట్ పెట్టుబడిదారులా?

ప్రజాస్వామ్యం ఒకప్పుడు ప్రజలకు విముక్తి ఆశను ఇచ్చింది. రాజరికాలను, వలస పాలనలను, నియంతృత్వాలను సవాలు చేసే శక్తిగా ఎదిగింది. కానీ అదే ప్రజాస్వామ్యం ఇప్పుడు మార్కెట్ శక్తులతో కలిసిపోయి ప్రజలనే నిస్సహాయులుగా ఉంచేస్తోంది. 2011 మార్చి నెలలో జపాన్‌లోని ఫుకుషిమా అణు కేంద్రంలో జరిగిన ప్రమాదం దీనికి ఉదాహరణ. జపాన్‌లో ప్రజాస్వామిక ప్రభుత్వమే వుంది. అయినప్పటికీ, అది కార్పొరేట్ల ప్రయోజనాలను నేరవేర్చే క్రమంలో ప్రజల భద్రతను కూడా పక్కన పెట్టింది. ప్రజాస్వామ్యం ఉన్నంత మాత్రాన ప్రజల భద్రతకు హామీ వుంటుందని చెప్పడానికి వీల్లేదని ఫుకుషిమా సంఘటన నిరూపించింది. ఇదే నేటి ప్రపంచ సంక్షోభం.

అయితే దీనికి పరిష్కారం నియంతృత్వమా? మతద్వేషానికి విరుగుడు మతద్వేషం కానట్టే, విఫలమైన ప్రజాస్వామ్యానికి విరుగుడు నియంతృత్వం కాదు. అయితే, ప్రజాస్వామ్యాన్ని ప్రశ్నించకుండా ప్రజాస్వామ్యాన్ని కాపాడలేం.

## కౌండిన్య స్టడీ సర్కిల్స్, ఫంక్షన్ హాళ్లు ఏర్పాటు చేస్తాం

మొదటిపేజీ తరువాయి

బీసీ కార్పొరేషన్, సెట్నల్, జిల్లా కేంద్ర పరిశ్రమల శాఖ, స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా తదితర సంస్థల ద్వారా లబ్ధి పొంది పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని కోరారు. గౌడ కులస్తులకు తన వంతు సహాయ సహకారాలను ఎల్లవేళలా అందిస్తానని హామీ ఇచ్చారు. పార్లమెంటులో సైతం దేశంలోని గౌడ్స్ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ప్రకటించారు. నూతనంగా జిల్లా గౌడ సంఘం అధ్యక్షులుగా తిరకాల సీనయ్య గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికవ్వడం పట్ల సంతోషం వ్యక్తంచేశారు. జిల్లాలో గౌడ్ భవనాల నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తామని తెలిపారు.

**సమస్యల పరిష్కారానికి కృషి**

అనంతరం తిరకాల సీనయ్య గౌడ్ మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో వేలాదిగా ఉన్న గౌడ కులస్తులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ముఖ్యంగా గీత కార్మికులు సరైన వ్యాపారం లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, ప్రాణాలకు సైతం భద్రత కరువై నిత్యం ప్రమాదాల బారిన పడుతూ కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయని తెలిపారు. నగరంలో కౌండిన్య కళ్యాణ మండపం, కౌండిన్య స్టడీ సర్కిల్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. నెల్లూరు జిల్లాలో అన్ని నియోజకవర్గాలలో మద్యం, బెల్ట్ షాపుల బెడదను తగ్గించాలని కోరారు. గీత కార్మికులకు మల్టీ ట్రీ క్లైంబర్స్ ప్రభుత్వం ఉచితంగా అందజేయాలని, హెడ్ టార్చ్ లైట్లు, మోటార్ సైకిళ్లు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో చనిపోయిన కార్మికులకు ఎక్స్రేషియా, ఇన్సూరెన్స్ తక్షణమే వచ్చేలా కృషి చేయాలని, వారి పిల్లలకు ఉచిత విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వాల పరంగా పెన్షన్లు, సంక్షేమ పథకాలను త్వరితగతిన అందేలా చూడాలని తెలిపారు.

**నాయకుల సంఘీభావం**

ఈ కార్యక్రమంలో గౌడ్ సంఘం నాయకులు అన్నం దయాకర్ గౌడ్, పెంపులూరు భాస్కర్ గౌడ్, తుళ్లూరు మల్లికార్జున గౌడ్, ఏపూరి రమేష్ గౌడ్, ముక్కు రాధాకృష్ణ గౌడ్, జడపల్లి రాజారావు గౌడ్, తిరకాల మోహన్ బాబు గౌడ్ మరియు ఇతర అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## పాలమూరు-రంగారెడ్డిని బీఆర్ఎస్ నిర్లక్ష్యం చేసింది: మంత్రి జూపల్లి

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేసేందుకు జాప్యం లేకుండా నిధులు కేటాయిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి తెలిపారు. ఈ ప్రాజెక్టును 90 శాతం పూర్తిచేసినట్లు బీఆర్ఎస్ నేతలు మాట్లాడటం దారుణమన్నారు. హైదరాబాద్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్‌కు చెందిన మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు సీఎంతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రులు మీడియాతో మాట్లాడారు. హంతకులే దొంగ ఏడుపులు ఏడ్చినట్లు బీఆర్ఎస్ నేతలు 'పాలమూరు పోరుయాత్ర' పేరిట పాదయాత్ర చేస్తామనడం విడ్డూరమని వాకిటి శ్రీహరి అన్నారు. అధికారంలో ఉన్న పదేళ్లలో ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదో చెప్పి ప్రజల వద్దకు వెళ్లాలని హితవు పలికారు. పొర్లుదండాలు పెట్టినా పాలమూరు ప్రజలు ఆ పార్టీని నమ్మరన్నారు. రెండేళ్లలో పాలమూరు-రంగారెడ్డి పూర్తి చేస్తామని గతంలో కేసీఆర్ అన్నారని జూపల్లి గుర్తుచేశారు. రూ.లక్ష కోట్ల ప్రాజెక్టుకు సుమారు రూ.25 వేల కోట్లే ఖర్చు చేశారని చెప్పారు. ఈ ప్రాజెక్టును బీఆర్ఎస్ నిర్లక్ష్యం చేసిందన్నారు. పాదయాత్ర చేసే నైతిక హక్కు బీఆర్ఎస్ నేతలకు లేదని చెప్పారు. ధనిక రాష్ట్రాన్ని అప్పగిస్తే రూ.లక్షల కోట్ల అప్పులు మిగిల్చి ఏ ఒక్క ప్రాజెక్టునూ పూర్తిచేయలేదని జూపల్లి విమర్శించారు.

## డిజిటలైజేషన్‌తో మారుతున్న జర్నలిజం

మొదటిపేజీ తరువాయి

చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన నాంపల్లిలోని మీడియా అకాడమీ భవనంలో మంగళవారం నిర్వహించిన జర్నలిస్టుల చర్చా కార్యక్రమంలో పలువురు సీనియర్ జర్నలిస్టులు, అకాడమీకి అనుబంధ సభ్యులు పాల్గొని మీడియా రంగ భవిష్యత్ దిశ, డిజిటలైజేషన్, మీడియా చట్టాలు, శిక్షణ కార్యక్రమాలు, జర్నలిస్టుల సంక్షేమ అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సమాచార,పౌర సంబంధాల శాఖ ప్రత్యేక ప్రధాన కమిషనర్ జి. ముకుంద్ రెడ్డి, కార్యక్రమంలో పాల్గొని జర్నలిస్టులను అభినందించారు. జర్నలిజం డిగ్రీ చదివే రోజుల్లో పత్రికల ఎడిటోరియల్స్ చదవడం ద్వారా సివిల్ సర్వీసులపై ఆసక్తి పెరిగిందని, అదే తన విజయానికి పునాది అయిందని తెలిపారు. నేడు మీ అందరి ముందుకు రావడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. సమావేశంలో ఐ. వెంకట్ రావు మాట్లాడుతూ మీడియా అకాడమీ చేపడుతున్న కార్యక్రమాలను అభినందిస్తూ మరిన్ని పుస్తకాలను అకాడమీకి అందజేస్తానని తెలిపారు.మాజీ ఎమ్మెల్సీ అమీర్ అలీ ఖాన్ మాట్లాడుతూ జర్నలిజం తనకు ధైర్యం, గుర్తింపు ఇచ్చిందని పేర్కొంటూ అకాడమీకి కృతజ్ఞతలు తెలిపారు. ఉదుముల సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఆధునిక జర్నలిజానికి అనుగుణంగా అకాడమీ డిజిటల్ క్లాసులు, ఇంక్యూబేటర్ ఏర్పాటు చేయాలని, గ్యాగ్ ఆర్డర్ వంటి అంశాలపై చర్చలు నిర్వహించాలని సూచించారు. దేవులపల్లి అమర్ మాట్లాడుతూ 16 మంది వెటరన్ జర్నలిస్టుల వీడియోలను పుస్తకాల రూపంలో తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు సభ్యులు మీడియా రంగంలో కృత్రిమ మేధస్సు ప్రభావం పెరుగుతోందని, జర్నలిస్టులు నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మీడియా అకాడమీ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు ఆధునిక శిక్షణా కార్యక్రమాలు, ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాములు, డెస్క్ జర్నలిస్టులకు ప్రత్యేక శిక్షణలు నిర్వహించాల్సిన

అవసరం ఉందని సూచించారు. అకాడమీ భవనంలోని డిజిటల్ సదుపాయాలు, ఆధునిక ఆడిటోరియం, బోర్డు రూమ్, లైబ్రరీ, కంప్యూటర్ రూమ్ వంటి వసతులను మరింత సమర్థవంతంగా వినియోగించి జర్నలిస్టులకు ప్రయోజనం కలిగించాలని అభిప్రాయపడ్డారు. పాత పత్రికలు, అరుదైన పుస్తకాలు, నిజాం కాలం నాటి ప్రచురణలు, తెలుగు గ్రంథాలు తదితరాలను డిజిటలైజ్ చేసి భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. పలువురు సీనియర్ జర్నలిస్టులు తమ వద్దనున్న విలువైన పుస్తకాలను మీడియా అకాడమీ లైబ్రరీకి విరాళంగా అందిస్తామని తెలిపారు. సీనియర్ జర్నలిస్టులు మాట్లాడుతూ మీడియా చట్టాలలో కాలానుగుణ మార్పులు అవసరమని, సోషల్ మీడియాకు ప్రత్యేక ప్రవర్తనా నియమావళి తీసుకురావాలని పేర్కొన్నారు. మహిళా జర్నలిస్టులు మరియు గ్రామీణ ప్రాంత జర్నలిస్టుల కోసం ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. జర్నలిజం అనేది సమాజానికి అద్దం పట్టే వృత్తి అని, భయపడకుండా నిజాయితీతో వార్తలను ప్రజలకు అందించాల్సిన బాధ్యత జర్నలిస్టులపై ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. మీడియా అకాడమీ 1996 నుండి జర్నలిస్టుల అభివృద్ధికి విశేష సేవలు అందిస్తోందని, పుస్తక ప్రచురణలు, మోనోగ్రాఫ్‌లు, శిక్షణా కార్యక్రమాలు మీడియా రంగానికి ఎంతో ఉపయోగపడుతున్నాయని అభినందించారు. చర్చా కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు శ్రీ కె. రాంచందర్ మూర్తి, కేశవరావు దాసు, ఎస్. నాగేష్ కుమార్, డి. అమర్, బండారు శ్రీనివాస్ రావు, రవీందర్ ఎం.పీ., దిలీప్ రెడ్డి, మాదభూషి శ్రీధర్, ఎం. సుబ్బారావు, జగన్, ఆర్.వి. రామారావు,

ఎస్. వినయ్ కుమార్, వై. నరేందర్ రెడ్డి, విరాహత్ అలీ తదితరులు పాల్గొని మీడియా రంగంలో వస్తున్న మార్పులు, డిజిటలైజేషన్, జర్నలిస్టుల శిక్షణ, మీడియా చట్టాలు, సోషల్ మీడియా ప్రభావం, పుస్తక ప్రచురణలు, అకాడమీ భవిష్యత్ కార్యాచరణపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మీడియా అకాడమీ చేపడుతున్న కార్యక్రమాలను పలువురు ప్రశంసించారు. జర్నలిస్టుల సంక్షేమం, శిక్షణ, డిజిటలైజేషన్, మీడియా ఆధునీకరణ దిశగా అకాడమీ మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన ప్రముఖులందరిని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు శాలువాలతో సీనియర్ జర్నలిస్టులను సత్కరించారు.

## ఏపీలో వెయ్యి మినీ మార్టులు ఏర్పాటు చేస్తాం: మంత్రి నాదెండ్ల మనోహర్

మొదటిపేజీ తరువాయి

రాష్ట్రానికి చెందిన పలు కీలక అంశాలపై వారితో చర్చించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.మినీ మార్టుల ద్వారా మిల్లెట్స్ కూడా ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని మనోహర్ తెలిపారు. మినీ మార్టులలో మార్కెట్ ధరల కంటే తక్కువకు నాణ్యమైన సరకులు అందజేస్తామన్నారు. మరోవైపు.. అరకు కాఫీని దేశవ్యాప్తంగా అన్ని మిలిటరీ క్యాంటీన్లలో ప్రవేశపెట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారని మంత్రి వివరించారు.

## తిరుమలలో భవనంపై నుంచి పడి కార్మికుడి మృతి

మొదటిపేజీ తరువాయి

అవధూత దత్తపీఠం వద్ద వాటర్ ట్యాంక్ మరమ్మతులు చేస్తుండగా.. ప్రమాదవశాత్తూ కాలుజారి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు తమిళనాడులోని తిరుపత్తూర్ వనియంబాడికి చెందిన మణికంఠన్ (35)గా గుర్తించారు. ఘటనపై తిరుమల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 'నీట్'పై ధర్మేంద్ర ప్రధాన్ ఉన్నతస్థాయి సమీక్ష

మొదటిపేజీ తరువాయి

దిల్లీ: మళ్లీ నిర్వహించనున్న నీట్-యూజీ పరీక్షపై కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. కట్టుదిట్టమైన భద్రత, ప్రొటోకాల్‌తో పరీక్షను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష నిర్వహణలో సమగ్రత, పారదర్శకత అవసరాన్ని గుర్తుచేశారు. గత పరీక్షలో గుర్తించిన లోపాలను పరిష్కరించాలన్నారు. నీట్ పరీక్షపై కలెక్టర్లు, ఎస్పీలతో సమన్వయ సమావేశాలు జరపాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద అప్రమత్తత, భద్రతపై రాజీపడొద్దన్నారు.

నీట్ ప్రశ్నపత్రం లీక్‌పై సీబీఐ విచారణ జరుగుతోందని..ఈ కేసుతో సంబంధం ఉన్న పలువురిని ఇప్పటికే పోలీసులు అరెస్ట్ చేశారని కేంద్రమంత్రి పేర్కొన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు నష్టపోకూడదనే పరీక్ష రద్దు చేసి మళ్లీ నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థుల భవిష్యత్తు బాగుండేలా చూడటమే మొదటి లక్ష్యమన్నారు. 2026 నీట్ పేపర్ లీక్ కావడంతో మే 3న నిర్వహించిన పరీక్షను రద్దు చేసి, మళ్లీ జూన్ 21న ఈ పరీక్షను నిర్వహించనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఇటీవల వెల్లడించిన విషయం తెలిసిందే.

## ఆ పిటిషన్లను విచారిస్తాం: సుప్రీంకోర్టు

మొదటిపేజీ తరువాయి

దిల్లీ: దక్షిణాదిలోని 3 రాష్ట్రాలు, ఓ కేంద్ర పాలిత ప్రాంతంలో హిందూ దేవాలయాలపై రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణ చెల్లుబాటు అంశంలో దాఖలైన పిటిషన్లను విచారణకు స్వీకరిస్తున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది. గతంలో దాఖలైన ఈ పిటిషన్ల విషయంలో హైకోర్టులనే ఆశ్రయించాలని ఇచ్చిన ఆదేశాలను ఉపసంహరించుకుంది. గతేడాది ఏప్రిల్‌లో ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకుంటున్నట్లు జస్టిస్ బీవీ నాగరత్న ధర్మాసనం ప్రకటించింది.

ఏపీ, తెలంగాణ, తమిళనాడుతో పాటు కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో హిందూ దేవాలయాలు, మతపరమైన దానాల నిర్వహణను నియంత్రించే పలు చట్టాల రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ గతంలో సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. కమిషనర్లకు అధికారాలు, ట్రస్టీల నియామకం, ఆలయ ఖాతాల ఆడిట్, మిగులు నిధుల వినియోగం, ఆలయ ఆస్తుల అన్యాక్రాంతం, హిందూ మత సంస్థలపై రాష్ట్ర పర్యవేక్షణ వంటి అంశాలను సవాల్ చేస్తూ ఈ పిటిషన్లు దాఖలయ్యాయి.

## తెలంగాణలో శాస్త్రీయంగా వ్యర్థాల నిర్వహణ

మొదటిపేజీ తరువాయి

కొత్త నిబంధనలు సంప్రదాయ చెత్త సేకరణ, డంపింగ్ విధానాలకే పరిమితం కాకుండా, 4-వే సోర్స్ సెగ్రిగేషన్, వికేంద్రీకృత వ్యర్థాల ప్రాసెసింగ్, పాత డంప్‌యార్డుల శాస్త్రీయ శుద్ధి, వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి, సాంకేతిక ఆధారిత పర్యవేక్షణ, సర్క్యులర్ ఎకానమీ, వార్డు స్థాయి బాధ్యత, ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఈ దిశగా నిబంధనలు అమలులోకి రాకముందే పలు చర్యలు ప్రారంభించిందని వివరించారు. రాష్ట్రంలోని కోర్ అర్బన్ ప్రాంతాల్లో దాదాపు 9,596 ఎలక్ట్రిక్ స్వచ్ఛ ఆటో టిప్పర్లను ప్రవేశపెట్టే పక్రియను తెలంగాణ ప్రభుత్వం చేపడుతోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఈ వాహనాల ద్వారా మున్సిపల్ కార్యకలాపాల్లో కార్బన్ ఉద్గారాలు తగ్గడంతో పాటు, శుభ్రమైన రవాణా విధానానికి మార్గం సుగమం అవుతుందని అన్నారు. వీటిని 4-వే సోర్స్ సెగ్రిగేషన్‌కు అనుగుణంగా విభజిత చెత్త నిల్వ స్థలాలతో రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఖీఖీ కోడ్ ఆధారిత పర్యవేక్షణ ద్వారా ఇంటింటి చెత్త సేకరణను మరింత సమర్థవంతంగా అమలు చేయనున్నట్లు చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం వికేంద్రీకృత, పంపిణీ ఆధారిత వ్యర్థాల ప్రాసెసింగ్ వ్యవస్థలకు ప్రాధాన్యం ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తడి చెత్తను ఉత్పత్తి అయిన ప్రాంతాల సమీపంలోనే ప్రాసెస్ చేయడం, పొడి చెత్తను శాస్త్రీయంగా వేరు చేసి రీసైక్లింగ్ మరియు సర్క్యులర్ ఎకానమీ వ్యవస్థల్లోకి తీసుకురావడం, ల్యాండ్‌ఫిల్ ప్రాంతాలకు కనిష్ట వ్యర్థాలు మాత్రమే చేరేలా చేయడం ప్రభుత్వ విధానమని వివరించారు. తడి చెత్తను నగరాల్లో దూర ప్రాంతాలకు తరలించడం వ్యయభారంతో కూడుకున్నదిగా ఉండటమే కాకుండా, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా కూడా సుస్థిర విధానం కాదని ఉప ముఖ్యమంత్రి తెలిపారు.అందుకే వికేంద్రీకృత తడి చెత్త ప్రాసెసింగ్ కేంద్రాల ద్వారా స్థానిక స్థాయిలోనే వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. డంప్‌యార్డుల శాస్త్రీయ శుద్ధి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిన అంశమని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. హైదరాబాద్‌లోని జవహర్‌నగర్ డంప్ యార్డ్ విషయంలో ఐఐటీ బాంబే సాంకేతిక సహకారం, సలహా సేవలను పొందుతున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. దీని లక్ష్యం మొక్కుబడి చర్యలకే పరిమితం కాకుండా, దీర్ఘకాలిక పర్యావరణ నిర్వహణ వ్యూహాన్ని రూపొందించడం, నిరంతర పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయడమని పేర్కొన్నారు. అలాగే ఆటోనగర్ డంప్ సైట్‌లో సుమారు 40 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న 22 లక్షల మెట్రిక్ టన్నుల వ్యర్థాలను బయోమైనింగ్ ద్వారా ప్రాసెస్ చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు దాదాపు 30 శాతం వ్యర్థాలు ప్రాసెస్ అయ్యాయని వివరించారు. స్వాధీనం చేసుకున్న భూమిని మళ్లీ డంపింగ్ కోసం కాకుండా, భవిష్యత్తులో పార్కులు, క్రీడా సదుపాయాలు, ప్రజా వినియోగ మౌలిక సదుపాయాలుగా అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోందని తెలిపారు.

# నైపుణ్యాభివృద్ధితో ఎన్నో అవకాశాలు

**- విద్యార్థులు, యువత వివిధ శిక్షణ సంస్థల కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి**
**- ఉద్యోగాలతోపాటు స్వయం ఉపాధిపై కూడా దృష్టి సారించాలి**
**- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**- ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలిలో భాగంగా యువజన క్రీడా వారోత్సవాల కింద నైపుణ్యాభివృద్ధిపై ఐడీఓసీలో అవగాహన సదస్సు**



రాజన్న సిరిసిల్ల, మే -19 ప్రజా దివాస్

నైపుణ్యాభివృద్ధితో ఎన్నో అవకాశాలు వస్తాయని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 23వ తేదీ వరకు నిర్వహించనున్న యువజన క్రీడా వారోత్సవాల సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం నైపుణ్యాభివృద్ధిపై అవగాహన సదస్సు నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జయ జయహే తెలంగాణ పాటను వినిపించారు. ఈ సందర్భంగా వివిధ శిక్షణ సంస్థలు ఐటీఐ, అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్, ఆర్ సేటీ, జీఎంఆర్, ఐడీటీఆర్, టాస్క్, ఇతర సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించి.. ఏ ఏ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు? అర్హత ఇతర అంశాలపై జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి మార్చి 6వ తేదీన ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. ఇందులో భాగంగా జూన్ 12వ తేదీ వరకు 10 శాఖల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 23వ తేదీ వరకు నిర్వహించనున్న యువజన క్రీడా వారోత్సవాలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. దేశ, రాష్ట్ర అభివృద్ధిలో నేటి యువత, విద్యార్థులు చాలా కీలకమని స్పష్టం చేశారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇటీవల విద్యా శాఖ వారోత్సవాల కింద సమ్మర్ క్యాంపులు నిర్వహించామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఎన్నో అంశాల్లో ప్రతిభ చూపారని గుర్తు చేశారు. విద్యతోపాటు ఆటలు ఆడాలని, దీంతో శారీరక, మానసిక సమతుల్యత ఉంటుందని, క్రమ శిక్షణ అలవడుతుందని వివరించారు. ఉన్నత చదువుతోపాటు టెక్నికల్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్ నేర్చుకోవాలని సూచించారు. ఇప్పటి పరిశ్రమలకు ఎలాంటి స్కిల్స్ అవసరమో తెలుసుకొని ఆ దిశలో ముందుకు వెళ్లాలని పిలుపు నిచ్చారు. ఐటీఐ, అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్, ఆర్ సేటీ, జీఎంఆర్, ఐడీటీఆర్, టాస్క్ తదితర సంస్థల్లో అందిస్తున్న ఉచిత శిక్షణ కోర్సులను సద్విని యోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. పూర్తి వివరాలకు ఆయా సంస్థల్లో సంప్రదించాలని సూచించారు. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ లో శిక్షణ పొందిన వారికి పలు సంస్థలు ఉపాధి కల్పిస్తాయని తెలిపారు. పరిశ్రమల శాఖ, ఇతర ప్రభుత్వ శాఖల ఆద్వర్యంలో అందిస్తున్న స్వయం ఉపాధి స్కీములు, సబ్సిడీ సద్వినియోగం చేసుకొని.. స్వయం యువత ఉపాధి పొందాలని ఆకాంక్షించారు.జిల్లాలోని వివిధ శిక్షణ సంస్థలు ఏడాది అంతా యువతకు శిక్షణ అందించేలా ప్రణాళిక రూపొందించి ముందుకు వెళ్లాలని సూచించారు. నర్సింగ్ పూర్తి చేసి.. విదేశాల భాష, నైపుణ్యాల్లో పట్టు ఉన్న వారికి టామ్ కామ్ ఆద్వర్యంలో వివిధ దేశాల్లో ఉపాధి కల్పన అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. జిల్లా నుంచి ఇప్పటిదాకా 45 మందికి విదేశాల్లో కొలువులు వచ్చాయని తెలిపారు. నర్సింగ్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. యువత ఉపాధిని పొంది తమ తల్లితండ్రుల సంరక్షణ బాధ్యతను చూసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, సీపీఓ శ్రీనివాసాచారి, జీఎం ఇండస్ట్రీస్ హనుమంతు, డీవైఎస్ఓ రాందాస్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్య, ఎల్డీఎం మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

# కామ్రేడ్ సుందరయ్య వర్ధంతి వేడుకలు

ముస్తాబాద్/మే 19 ప్రజా దివాస్



రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో రాజీవ్ గాంధీ విగ్రహం దగ్గర సిపిఎం ముస్తాబాద్ మండల కన్వీనర్ గీస బిక్షపతి మరియు పలు కార్మిక సంఘాల నాయకుల ఆధ్వర్యంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఎం పార్టీ శ్రీ పుచ్చలపల్లి సుందరయ్య 41 వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు అనంతరం మండల సిపిఎం కన్వీనర్ గీసబిక్షపతి మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య అంటే తన జీవితాన్ని బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పుచ్చలపల్లి సుందరయ్య అంటేనే రాజకీయానికి వన్నె తీసుకొచ్చినటువంటి మహనీయుడు తన మూడుసార్లు అసెంబ్లీ మెట్లు ఎక్కి తన భూములను పేద ప్రజల కోసం ఇల్లు లేని నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చి అసెంబ్లీలోనే తన ఎన్నో రాజకీయ అనుభవం ఉన్న మహనీయుడు తను సైకిల్ పై అసెంబ్లీకి వెళ్లి రాజకీయ చరిత్రనే మార్చినటువంటి మహనీయుడు పుచ్చలపల్లి సుందరయ్య కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య చేసిన త్యాగాలకు గుర్తింపుగా నివాళులర్పిస్తూ జోహార్ సుందరయ్య జోహార్ అంటూ నినాదాలు చేశారు ఈ కార్యక్రమంలో ముస్తాబాద్ మాజీ సర్పంచి నల్ల నరసయ్య బాబు లక్ష్మణ్ బాలెళ్ళు లక్ష్మి రంజాన్ రాజయ్య బిక్షపతి మల్లేశం పలు కార్మిక సంఘాల నాయకులు గ్రామపంచాయతీ పారిశు ద్ధ కార్మికులు తదితరులు పాల్గొన్నారు

# వేములవాడలో కౌమార బాలికలకు హెల్త్ స్క్రీనింగ్ క్యాంప్

వేములవాడ/ప్రజాదివాస్ మే 19



వేములవాడ మున్సిపల్ పరిధిలో "99 రోజుల ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక"లో భాగంగా స్థానిక బస్తీ దవాఖానాలో కౌమార బాలికల కోసం ప్రత్యేక హెల్త్ స్క్రీనింగ్ క్యాంప్‌ను నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ జి. లోకేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 15 నుండి 18 సంవత్సరాల వయస్సు గల కౌమార బాలికలకు అనీమియా (రక్తహీనత), డయాబెటిక్ మరియు బీఎంఐ (బాడీ మాస్ ఇండెక్స్) వంటి పలు రకాల కీలక ఆరోగ్య పరీక్షలు ఉచితంగా చేశారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి పట్టణంలోని బాలికలు పెద్ద సంఖ్యలో హాజరై పరీక్షలు చేయించుకుని, వైద్యుల సలహాలు పొందారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జి. లోకేష్‌తో పాటు మెప్మా ~~~ ఫసత్ అలీబేగ్, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం ఆఫీసర్ నయీం, జబ్బూ సౌందర్య, ఎవీజ భూలక్ష్మి, బస్తీ దవాఖానా డాక్టర్లు, వైద్య సిబ్బంది, ~~~ వీలు, మెప్మా జూ~~~ం మరియు ~~~లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఆపన్నహస్తం కోసం. నిరుపేద కుటుంబం ఆర్తనాదాలు..

**- అనారోగ్యంతో మంచానికి పరిమితమైన కుటుంబ పెద్ద.**
**- వీర్నపల్లి మండలంలోని భుక్య తండ గ్రామ పంచాయితీ లో గూగులోత్ లింగమూర్తి కి వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం ఆ కుటుంబానికి ఆదుకోవాలి**
**- దిక్కుతోచని స్థితిలో భార్య,**
**- ప్రభుత్వం వెంటనే స్పందించి ఆదుకోవాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు**

వీర్నపల్లి మండలం మే 19 ప్రజా దివాస్

దాతలు ఆపన్నహస్తం అందించాలని ఆ కుటుంబం ఆర్తనాదాలు పెడుతోంది.. ప్రమాదంలో కుటుంబ పెద్ద అనారోగ్య కారణం తోమంచానికే పరిమితమయ్యాడు. దాంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడిపోయింది. కట్టుకున్న భార్య, కడుపున పుట్టిన ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.ఇలా చెప్పుకుంటూ పోతే కష్టాలన్నీ ఆ ఇంట్లోనే తిష్ట వేసినట్లు వుంటుంది పరిస్థితి.. వీటన్నింటిని ఎదుర్కొని కష్టపడి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించికుంటున్న కుటుంబ పెద్ద ఒక్కసారిగా మంచాన పడితే ఆ కుటుంబ పరిస్థితి ఎలా వుంటుందో ఓ సారి ఆలోచించుకోండి.. మానవత్వంతో మీకు తోచిన సాయం చేయండి.. వివరాల్లోకి వెళితే. వీర్నపల్లి మండల పరిధిలోని భూక్యా తండా కు చెందిన గూగులోత్ లింగమూర్తి(38), భార్య లావణ్య దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు.లింగమూర్తి వృత్తిరీత్యా వ్యవసాయ కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. సూచించారు. అతనికిముగ్గురు ఆడ పిల్లలు 1.శ్రావణి 13 సంవత్సరాలు 2. శ్రీనిధి 10సంవత్సరాలు 3. అమూల్య 8 సంవత్సరాలు లింగమూర్తి గత మూడు సంవత్సరాల నుండి షుగర్ వ్యాధితో బాధపడుతున్నారు ఇటీవల షుగర్ వ్యాధి ఎక్కువ కావడం వల్ల ఊపిరితిత్తులు, కిడ్నీలు చాలా వరకు డామేజ్ కావడం జరిగింది...చల్మెడా ఆనందరావు హాస్పిటల్ లో మూడు రోజులు అడ్మిట్ అయి దాదాపు లక్ష రూపాయలు కావడం జరిగింది ఆర్థిక పరిస్థితి బాలేనందున తిరిగి సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు తనమీద ముగ్గురు ఆడపిల్లలు మరియు తల్లిదండ్రులు భార్య ఆధారపడి ఉన్నారు.ఆర్థిక పరిస్థితి సరిగా లేని లింగమూర్తి కుటుంబం సరైన వైద్యం అందించలేక మదన పడుతుండటంతో గమనించిన స్థానిక గ్రామస్తులు ఆర్థిక సాయం కోసం దాతలను ఆశ్రయించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న సేవా లాల్ సోషల్ సర్వీస్ వారు స్పందించి దాతలు ఆ కుటుంబానికి ఆదుకోవాలని




పిలుపునిచ్చరు.వైద్య సేవల నిమిత్తం దాతలు ఆదుకోవాలని అన్నారు. సహాయం చేద్దాం..మానవత్వాన్ని చాటుదాం మనకు తెలియకుండా వృధాగా ఎంతో ఖర్చు పెడుతుంటాం. మీరు చేసే చిన్నపాటి సహాయం ఆ కుటుంబం నకు ఎంతో మనోధైర్యాన్ని ఇచీన్న వాళ్లవుతరు. గుగులోత్ లింగమూర్తి భూక్య తండా వీర్నపల్లి మండలం వారిది బీద కుటుంబం కావున సేవాలాల్ సోషల్ సర్వీస్ వారు సాయం చేద్దాం కుటుంబానికి అండగా నిలుద్దాం మన వంతుగా సహాయం చేద్దాం. సహాయాన్ని చేద్దాం అని సేవాలాల్ సోషల్ సర్వీస్ వారు పేర్కొన్నారు మరియు ప్రభుత్వం చొరవ తీసుకొని ఆ కుటుంబానికి ఆదుకొని కాపాడాలని కోరుతున్నారు.ఈ క్రింద ఇవ్వబడిన ఫోన్ పే/గూగుల్ పే నెంబర్ కి పంపగలరు భూక్య లింగం నాయక్ సేవాలాల్ సోషల్ సర్వీస్ ప్రధాన కార్యదర్శి 9949415677

# ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని గ్రామ ప్రజల సద్వినియోగం చేసుకోవాలి గ్రామ సర్పంచ్




ముస్తాబాద్/మే 19 ప్రజా దివాస్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల గ్రామ ప్రజలకు రైతులకు, తెలియజేయునది ఏమనగా వేంకటేశ్వర స్వామి గుడి ముందర తేదీ: 20-05-2026 బుధవారం రోజున ఉదయం 9:30 గంటల నుంచి 1:30 గంటల వరకు ఎల్.వి.ప్రసాద్ కంటి ఆసుపత్రి సిరిసిల్ల వారి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించబడును కావున గ్రామ ప్రజలు,రైతులు యువకులు వృద్ధులు ఇట్టి అవకాశమును సద్వినియోగం చేసుకోగలరని ముస్తాబాద్ గ్రామ సర్పంచ్ మట్ట వెంకటేశ్వర్ రెడ్డి పాలకవర్గం గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు గమనిక ఉచిత నేత్ర వైద్య శిబిరానికి వచ్చే ప్రజలు వారి ఆధార్ కార్డు ఫోన్ నెంబర్ తప్పకుండా తీసుకురావలెను అదేవిధంగా పరీక్షలు నిర్వహించిన అనంతరం అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్ మందులు అందిస్తారని తెలిపారు

# గూడెంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

**- పంట మార్పిడితోనే అధిక దిగుబడి సాధ్యం ప్రొఫెసర్ డాక్టర్ పి మాధవి**

ముస్తాబాద్ /మే 19 ప్రజా దివాస్





రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం గూడెం గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం ద్వారా అవగాహన సదస్సులు రైతులు భూసార పరీక్ష ఆధారంగా ఎరువుల యాజమాన్యం చేయడం, పప్పు జాతి పంటలతో పంట మార్పిడి, పచ్చిరొట్ట ఎరువుల సాగు ద్వారా అధిక దిగుబడితోపాటు నేల ఆరోగ్యాన్ని కూడా పెంచుకోవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం సిరిసిల్ల వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్లు డాక్టర్ పి మాధవి, రైతులకు సూచించారు. గూడెం గ్రామం లో ఏర్పాటు చేసిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా,డాక్టర్ పి మాధవి మాట్లాడుతూ భూసార పరీక్షలు తోపాటు సాగు నీటి పరీక్ష ప్రతి రైతు చేసుకోవాలని, మట్టి నమూనా ఎలా తీసుకోవాలో వివరించారు. నేల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తూ, బావి తరాలకు సారవంతమైన నేలలను అందించాలని సూచించారు. రైతులు వరి పంటలో సన్న రకాలను సాగు చేయవచ్చని, ఆర్ఎన్ఆర్ 15048, కే ఎన్ ఎం -1638, హెచ్ఎంటి సోనా, జైశ్రీరామ్ వంటి రకాలను సాగు చేయవచ్చు అని రైతులకు డా. ప్రీతిక సూచించారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న వరి రకాలను పండించి అధిక ఆదాయం పొందవచన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో అనూష, ఏఈఓ సౌమ్య, కళాశాల విద్యార్థులు జెన్నీ, త్రిశూల్, మహిళ రైతులు, రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# నకిలీ రికార్డులతో గ్రామ నిధులు గోల్మాల్.... భారీ కుంభకోణం

**- ప్రభుత్వ సొమ్మును పక్కదారి పట్టించిన సెక్రటరీ**



మే -19 ప్రజా దివాస్
నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమరాబాద్ మండలం మన్ననూర్ (ప్రశాంత్ నగర్) గ్రామపంచాయతీలో భారీ కుంభకోణం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామంలో అనేక రకాల అభివృద్ధి పనుల పేరిట నకిలీ రికార్డులు సృష్టించి సుమారు 6.7 లక్షల ప్రభుత్వ నిధులను పంచాయతీ కార్యదర్శి పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ వ్యవహారంపై అనుమానం వచ్చిన గ్రామస్తులు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) మరియు జిల్లా పంచాయతీ అధికారి (డిపిఓ) లకు బాధితులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ సొమ్మును పక్కదారి పట్టించిన సెక్రటరీ పై ఉన్నత అధికారులు స్పందించి వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# కాంపౌండ్ వాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జారె

మే -19 ప్రజా దివాస్



దమ్మపేట మండల కేంద్రంలో గల టిటిడి కళ్యాణమండపం ఎదురుగా గల విశ్రాంత ఉపాధ్యాయుల భవన కాంపౌండ్ వాల్ నిర్మాణానికి మంగళవారం అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ సర్పంచ్ పగడాల రమాదేవి తో కలిసి ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపి డైరీ, క్యాలెండర్ అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల విశ్రాంతి భవనము ఆధ్యాత్మిక కార్యక్రమాలకు వినియోగిస్తూ పలువురికి ఉపయోగకరంగా ఉండటం సంతోషకరంగా ఉందని, ప్రహరీ ఉంటే భద్రత ఉంటుంది అనే ఉద్దేశ్యంతో నిర్మాణం చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ సందర్భంగా 12వ వార్డు సభ్యురాలు సరిత నెమలిపేట ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణం కట్టాలని ఎమ్మెల్యేని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు, ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కక్కిరాల రమేష్, ఆత్మ కమిటీ సభ్యులు పగడాల కృష్ణారావు, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, దాసరోజు సరిత రామారావు, మెంబర్లు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు శంకరవర అయ్యప్ప, ధర్మసోతు నరేష్, పిట్టల శ్రీనివాసరావు, వనమాల వసంత, విశ్రాంతి ఉద్యోగులు రావెల్లి అజయ్ కుమార్, దారా నాగేశ్వరరావు, సదాశివరావు, తునికిపాటి సత్యనారాయణ స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# ఉస్మాన్ నగర్ కేజీబీవీ పాఠశాల బలోపేతమే ధ్యేయం పర్స శ్యామ్ రావు

**- ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కార్మిక కనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి**

మే -19 ప్రజా దివాస్



పటాన్చెరు నియోజకవర్గం లో మంగళవారం ఉస్మాన్ నగర్‌లోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ పాఠశాలలో రూ.60.98 లక్షల వ్యయంతో నిర్మించనున్న అదనపు గదుల నిర్మాణం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.సంగారెడ్డి డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పర్స శ్యామ్ రావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో విద్యా వ్యవస్థ బలోపేతానికి, ముఖ్యంగా పేద విద్యార్థినులకు నాణ్యమైన విద్యను అందించడంలో కేజీబీవీల పాత్రను కొనియాడారు. స్థానిక విద్యా సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లడంలో చొరవ చూపారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి, పటాన్చెరు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అంజిరెడ్డి, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ గారితో పాటు పటాన్చెరు నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# ధాన్యం తరలింపు.. అన్ లోడింగ్ లో మరింత వేగం పెంచాలి

**- ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు వాహనాలను సరిపడా సమకూర్చాలి**
**- ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ వేగవంతం చేయాలి**
**- కొనుగోలు కేంద్రాలు, గోదాముల్లో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో పెట్టాలి**
**- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**- ధాన్యం కొనుగోలు ప్రక్రియపై అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్**



రాజన్న సిరిసిల్ల, మే -19 ప్రజా దివాస్
కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తరలింపు.. రైస్ మిల్లులు, గోదాముల్లో అన్ లోడింగ్ లో మరింత వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం తరలింపు, అన్ లోడింగ్, ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ, రైతులు, హమాలీలకు ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలపై మంగళవారం ఉదయం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి పౌర సరఫరాల, సహకార శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, మెప్మా ఇతర శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తూకం వేయడం, తూకం వేసిన ధాన్యాన్ని నిర్దేశించిన మిల్లులు, గోదాములకు తరలించడంపై అధికారులు దృష్టి సారించి, క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, కొనుగోళ్ళ ప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం బస్తాలను తరలించేందుకు సరిపడా వాహనాలను ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు సమకూర్చాలని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం లోడింగ్ కోసం, మిల్లులు, అపరల్ పార్క్ లో ధాన్యం అన్ లోడింగ్ చేయడం కోసం హమాలీల సంఖ్యను మరింత పెంచాలని సూచించారు.ఎండ తీవ్రత దృష్ట్యా కొనుగోలు కేంద్రాల్లో రైతులు, హమాలీలు అలాగే అన్ లోడింగ్ చేసే మిల్లులు, గోదాముల్లో హమాలీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని, తాగు నీరు, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో పెట్టాలని సూచించారు. ఇంకా జిల్లాలో ఉన్న గోదాములను ధాన్యం అన్ లోడింగ్ చేసేందుకు సిద్ధం చేయాలని ఆదేశించారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి సంబంధించిన ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ జాప్యం చేయవద్దని డీఆర్డీఓ, డీసీఓ, ఏవో మెప్మా, ఇతర అధికారులను ఆదేశించారు. ఆయా మండలాలకు చెందిన సంబంధిత అధికారులు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ వేగవంతం చేసేలా పర్యవేక్షణ చేయాలని సూచించారు.ధాన్యం కొనుగోలు కేంద్రాలను సంబంధిత శాఖల అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు తప్పనిసరిగా తనిఖీలు చేస్తూ సూచనలు చేయాలని సూచించారు.

# వర్షాకాలానికి ముందస్తు చర్యలు

**- శ్రీనగర్ కాలనీలో కచ్చా కాలువ పూడికతీత....**
**- పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి**

రాజన్న సిరిసిల్ల జిల్లా మే 19 ప్రజా దివాస్
రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి జిందం కళ చక్రపాణి, సిరిసిల్ల కొచ్చేరువు నుండి శ్రీనగర్ కాలనీ మీదుగా ఏర్పాటు చేసిన కచ్చా కాలువలలో జరుగుతున్న పూడికతీత పనులను పరిశీలించారు. వరదల నివారణకు చేపట్టవలసిన ముందస్తు చర్యలపై అధికారులతో చర్చిస్తూ స్థానిక 2వ వార్డును సందర్శించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాబోయే వర్షాకాలంలో అధిక వర్షాలు కురిసినట్లయితే బోనాల, వెంకంపేట, సర్దార్ నగర్, పద్మానగర్, రాజీవ్ నగర్ ప్రాంతాల మీదుగా ఉదర కాల్వ ద్వారా వచ్చే వరదనీరు కొచ్చేరువులోకి చేరి చెరువు కింది ప్రాంతాలు ముంపుకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఈ పరిస్థితిని నివారించేందుకు గతంలో శ్రీనగర్ కాలనీ మీదుగా కచ్చా కాలువను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ కాలువను శాశ్వత పరిష్కారంగా పక్కా సీసీ కాలువగా నిర్మించేందుకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్ రావు సహకారంతో, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ స్థానిక శాసనసభ్యులు కేటీ రామారావు రూ.15 కోట్ల నిధులను మంజూరు చేయించారని తెలిపారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం మారిన తరువాత పనులకు అనుమతులు రాకపోవడంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయని పేర్కొన్నారు.అయినప్పటికీ ప్రజలకు వరద నీటి వల్ల ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కచ్చా కాలువలో పెరిగిన తుంగ, పూడిక మట్టిని తొలగిస్తూ పూడికతీత కార్యక్రమాలను చేపట్టినట్లు చెప్పారు.అలాగే 2వ వార్డు ప్రజలతో మాట్లాడి వారు తెలిపిన సమస్యలను



పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. వరద కాలువ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రజలకు శాశ్వత పరిష్కారం కల్పించేలా పక్కా సీసీ కాలువ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని, శ్రీనగర్ కాలనీ అభివృద్ధికి ప్రత్యేక కృషి కొనసాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎండి ఖాదీర్ పాషా, డీఈ వాణి, సానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# లారీల సంఖ్యను మరింత పెంచాలి

**- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**- ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామంలో ఐకేపీ కొనుగోలు కేంద్రంలో కలెక్టర్, ఎస్పీ మహేష్ బి గితే తో కలిసి పరిశీలన**



ఇల్లంతకుంట, మే -19 ప్రజా దివస్
కొనుగోలు కేంద్రాల నుంచి దాస్యం తరలించేందుకు ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు లారీల సంఖ్యను మరింత పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. లిఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామంలో ఐకేపీ కొనుగోలు కేంద్రంలో కలెక్టర్, ఎస్పీ మహేష్ బి గితే, జిల్లా అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ధాన్యం ఎంత వచ్చింది? ఇప్పటిదాకా ఎంత కొనుగోలు చేశారో జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆరా తీశారు. తరలించేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యం సంచుల కోసం మరిన్ని వాహనాలను సమకూర్చాలని ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లను ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. రైస్ మిల్లులో తనిఖీ ఇల్లంతకుంట మండలం చింతలకుంట పల్లె గ్రామంలోని శ్రీ లక్ష్మీసాయి రైస్ ఇండస్ట్రీస్ లో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే, జిల్లా అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ధాన్యం లక్ష్యం కేటాయింపు ఎంత? ఇప్పటి వరకు ఎంత అన్ లోడ్ చేశారు? ఏ ఏ మండలాల నుంచి ధాన్యం వస్తుందో ఆరా తీశారు. హమాలీల సంఖ్యను పెంచి.. అన్ లోడింగ్ వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పరిశీలనలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, డీసీఎస్ఓ బుచ్చిబాబు, మేనేజర్ నరసింహా, డీసీఓ రామకృష్ణ, తహసీల్దార్ సురేష్, ఎంపీడీఓ శశికళ తదితరులు పాల్గొన్నారు.

# చింతలకుంట రైస్ మిలో కలెక్టర్, ఎస్పీ తనిఖీ: ధాన్యం అన్‌లోడింగ్ వేగవంతం చేయాలని ఆదేశం

ఇల్లంతకుంట మండలం/ప్రజాదివాస్ మే 19
ఇల్లంతకుంట మండలం చింతలకుంట పల్లె గ్రామంలోని శ్రీ లక్ష్మీసాయి రైస్ ఇండస్ట్రీస్ మిల్ లో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే, జిల్లా అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ధాన్యం లక్ష్యం కేటాయింపు ఎంత? ఇప్పటి వరకు ఎంత అన్ లోడ్ చేశారు? ఏ ఏ మండలాల నుంచి ధాన్యం వస్తుందో ఆరా తీశారు. హమాలీల సంఖ్యను పెంచి.. అన్ లోడింగ్ వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పరిశీలనలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, డీసీఎస్ఓ బుచ్చిబాబు, మేనేజర్ నరసింహా, డీసీఓ రామకృష్ణ, తహసీల్దార్ సురేష్, ఎంపీడీఓ శశికళ తదితరులు పాల్గొన్నారు.





# ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రజా ప్రతినిధుల మీడియా సమావేశం

**- అచ్చంపేట స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ**

మే -19 ప్రజా దివాన్

హైదరాబాద్ లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు గౌరవ శ్రీ రేవంత్ రెడ్డి గారి భేటీ అనంతరం అసెంబ్లీ లోని సీఎల్పీ కార్యాలయంలో నిర్వహించిన ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రజా ప్రతినిధుల మీడియా సమావేశంలో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును 90 శాతం పూర్తి చేశామన్న బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలను ఎమ్మెల్యే ఖండించారు. కుర్చీ వేసుకొని రెండేళ్లలో ప్రాజెక్టు పూర్తి చేయిస్తానని అప్పటి సీఎం కేసీఆర్ 2015 లో భూత్పూర్ లో ప్రకటించారని గుర్తుచేశారు. కానీ మెయిన్ కెనాల్స్, డిస్ట్రిబ్యూటర్లకు కనీసం అనుమతులు కూడా తీసుకురాలేదన్నారు. పంపులు, మోటార్లు, సర్జ్ పూల్స్ కోసం రూ.35 వేల కోట్లు కేటాయించినా, పదేళ్లలో కేవలం రూ.25 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని విమర్శించారు. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి కావాలంటే లక్ష కోట్ల రూపాయలు కావొచ్చన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు శంకుస్థాపన తర్వాత సంవత్సరానికి ప్రారంభించిన కాళేశ్వరం ప్రాజెక్టుకు లక్ష కోట్లు ఖర్చు పెట్టారని ఆరోపించారు. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుతో పాటు జిల్లాలోని ఇతర సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయించాలని. భూ సేకరణకు అవసరమైన నిధులను వెంటనే విడుదల చేసేలా చూస్తామని గౌరవ ముఖ్యమంత్రి వర్యులు హామీ ఇచ్చారనీ తెలిపారు. ఈ సందర్భంగా ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి సీఎం గారు పలు కీలక సూచనలు చేశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను దగ్గరుండి యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయించాలని




ఆదేశించారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి వీలయినంత త్వరగా భూసేకరణ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. భూసేకరణ నిధుల విషయంలో జాప్యం జరగకుండా వెంటనే చెల్లింపులు జరిగేలా చూస్తామనీ సిఎం తెలిపారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ బిల్లులను చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై జిల్లా మంత్రులు సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సీఎం గారు సూచించారనీ వారు తెలిపారు.

# లింగోటం గ్రామంలో మాదకద్రవ్యాల నిర్మూలన పై అవగాహన సదస్సు

**- మాదక ద్రవ్యాలకు అలవాటు పడోద్దని ఎక్సైజ్ అధికారులు సూచన**

మే -19 ప్రజా దివాన్




నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం లింగోటం గ్రామంలో గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా నేడు గ్రామంలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ కృష్ణ, ఎస్ఐ సతీష్ కుమార్ పాల్గొని మాలక ప్రవ్యాల గురించి ప్రజలకు ఎలా జాగ్రత్తలు తీసుకోవాలి, అదేవిధంగా ఎలా ఫిర్యాదు చేయాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. యువత మద్యం గంజాయి డ్రగ్స్ వంటి న మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే భవిష్యత్తు నాశనం అవుతుందని సిఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తాడెం జయప్రకాష్, గ్రామపంచాయతీ కార్యదర్శి రమేష్, గ్రామస్తులు మహిళలు తదితరులు పాల్గొన్నారు. యువత మద్యం గంజాయి డ్రగ్స్ వంటి చెడు మార్గాలలో నడిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ అధికారులు హెచ్చరించారు.

# వరి ధాన్యం కొనుగోలులో జాప్యం రైతులకు తీవ్ర ఇబ్బందులు..

**- కొనుగోలు కేంద్రాల వద్ద పేరుకుపోతున్న ధాన్యం కుప్పలు**
**- హమాలీలు, లారీల సంఖ్య పెంచాలని రైతుల విజ్ఞప్తి**
**- రైతు అందే స్వామి ఆవేదన**

మే -19 ప్రజా దివాన్

కామారెడ్డి జిల్లా బీబీపేట్ మండలం తుజాల్పూర్ గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై దాదాపు నెల రోజులు గడిచినా కొనుగోలు ప్రక్రియ నత్తనడకన సాగుతుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో రెండు చోట్ల ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు సుమారు 400 మంది రైతులు తమ



ధాన్యాన్ని తీసుకువచ్చి కుప్పలుగా నిల్వ ఉంచారు. అయితే ఇప్పటివరకు కేవలం 110 మంది రైతుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేసినట్లు రైతులు తెలిపారు. ధాన్యం కొనుగోలు ఆలస్యం కావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు పడే అవకాశం ఉండటంతో ధాన్యం తడిసిపోతుందేమోననే భయంతో రాత్రింబవళ్లు కేంద్రాల వద్దే కాపలా కాస్తున్నామని రైతులు వాపోతున్నారు. నెల రోజులుగా ధాన్యం అమ్ముడుపోకపోవడంతో ఆర్థికంగా కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతు అందే స్వామి మాట్లాడుతూ, అధికారులు వెంటనే స్పందించి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. హమాలీల సంఖ్యను పెంచడంతో పాటు మరిన్ని లారీలను అందుబాటులో ఉంచి ధాన్యం తరలింపును వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. రైతులు ఇబ్బందులు పడకుండా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

# పోలీసు వారు యువత నిర్లక్ష్య డ్రైవింగ్ పట్ల చర్యలు చేపట్టాలి... వాహనదారులు

**అచ్చంపేట పట్టణంలో వరుస రోడ్డు ప్రమాదాలు**

మే -19 ప్రజా దివాన్




నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణ కేంద్రంలో వేసవి సెలవుల నేపథ్యంలో యువత నిర్లక్ష్య డ్రైవింగ్ చేయడం పట్ల వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో అచ్చంపేట పట్టణంలో ఈరోజు ఉదయం హెచ్డిఎఫ్సి బ్యాంకు ముందు ఉన్న యూ టర్న్ వద్ద యువత నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల ముందు ఉన్న కారు సడన్ బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్నా మరొక కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో అచ్చంపేట పట్టణ కౌన్సిలర్ సునీత యొక్క కారు వెనుక భాగం నుజ్జు నుజ్జు అయింది. అదే సమయంలో ట్రెండ్స్ షోరూం దగ్గర ఉన్న యూటర్న్ వద్ద మరొక ప్రమాదం చోటుచేసుకుంది. లైసెన్సు లేకుండా మరియు డ్రైవింగ్ పై ఎలాంటి అవగాహన లేకుండా ఆడ మగ అనే తేడాలు లేకుండా రోడ్లపై డ్రైవింగ్ చేస్తున్నారు. ఇకనైనా పోలీసు వారు లైసెన్స్ లేకుండా నిర్లక్ష్యపు డ్రైవింగ్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు చేపట్టాలని వాహనదారులు స్థానికులు ప్రజాప్రతినిధులు కోరారు.

# కామారెడ్డిలో నీటి ఎద్దడిని తీర్చిన అపర భగీరథుడు మహమ్మద్ అలీ షబ్బీర్..

**- మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్**

మే -19 ప్రజా దివాన్

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ మాట్లాడుతూ, కామారెడ్డి పట్టణం నియోజకవర్గ ప్రజల దశాబ్దాల తాగునీటి సమస్యను పరిష్కరించిన నాయకుడు ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అని కొనియాడారు. ఇరవై సంవత్సరాల క్రితం కామారెడ్డి నియోజకవర్గంలోని గ్రామాలు, పట్టణాల్లో ప్రతి వేసవికాలంలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొనేదని, ప్రజలు ఖాళీ బిందెలతో రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలిపే పరిస్థితులు ఉండేవని ఆమె గుర్తు చేశారు. ఆ సమయంలో దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న షబ్బీర్ అలీ, కామారెడ్డి ప్రాంతానికి శాశ్వత తాగునీటి పరిష్కారం అందించాలనే లక్ష్యంతో ప్రత్యేక కృషి చేశారని తెలిపారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలను కామారెడ్డికి తీసుకురావడానికి దాదాపు 110 కిలోమీటర్ల మేర పైపులైన్ నిర్మాణం చేపట్టి, మల్లన్నగుట్ట వద్ద ఫిల్టర్ బెడ్ ఏర్పాటు చేసి గ్రామాలు, పట్టణాలకు తాగునీరు అందించేలా చర్యలు తీసుకున్నారని చెప్పారు. ఆ ప్రాజెక్టు ద్వారా దాదాపు పదేళ్ల పాటు కామారెడ్డి ప్రాంతంలో తాగునీటి సమస్య గణనీయంగా తగ్గిందన్నారు. అభివృద్ధి చెందుతున్న పట్టణ అవసరాలకు అనుగుణంగా కొత్త పైప్లైన్ల ఏర్పాటులో ఎదురైన అటవీ మరియు ఆర్అండ్బి శాఖల అనుమతి సమస్యలను కూడా షబ్బీర్ అలీ స్వయంగా చొరవ తీసుకుని పరిష్కరించారని తెలిపారు. ప్రస్తుతం పైప్లైన్ పనులు తుదిదశకు చేరుకున్నాయని, ఈ ప్రాజెక్టు పూర్తయితే గత ప్రభుత్వ హయాంలో కామారెడ్డికి సరఫరా అవుతున్న కేవలం 4 ఎం.ఎల్.డి. నీరు, 19 ఎం.ఎల్.డి.లకు పెరుగుతుందని వెల్లడించారు. ఈ వేసవికాలం ప్రారంభం నుంచే షబ్బీర్ అలీ ప్రతిరోజూ అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ పట్టణానికి రోజుకు 8 నుంచి 10 ఎం.ఎల్.డి.ల నీరు అందేలా చర్యలు తీసుకున్నారని చెప్పారు. గత పదేళ్లుగా వేసవి రాగానే ప్రతి వార్డులోనూ వాటర్ ట్యాంకర్లు తిరిగే పరిస్థితి ఉండేదని, కానీ ప్రస్తుతం పట్టణంలో ఎక్కడా ట్యాంకర్ల అవసరం లేకుండా నల్లాల ద్వారానే పుష్కలంగా తాగునీరు అందుతోందని పేర్కొన్నారు. అమృత్ 2.0 పథకం కింద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో, షబ్బీర్ అలీ సహకారంతో మరో 9 వాటర్ ట్యాంకులు మంజూరయ్యాయని




తెలిపారు. ప్రస్తుతం పట్టణంలో 10 వాటర్ ట్యాంకులు ఉండగా, రూ.11.89 కోట్ల వ్యయంతో నిర్మాణంలో ఉన్న కొత్త ట్యాంకులు పూర్తయితే కామారెడ్డి పట్టణానికి 19 ఎం.ఎల్.డి. నీటి సరఫరా అందుబాటులోకి వచ్చి సమస్య పూర్తిగా పరిష్కారం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కామారెడ్డి ప్రజల దాహార్తిని తీర్చేందుకు నిరంతరం కృషి చేసిన షబ్బీర్ అలీకి పట్టణ ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పర్వతాలు, డీఈ హన్మంతరావు, ఏఈ వినోద్, కౌన్సిలర్లు వాజీద్, జావేద్, అంజాద్, బబ్లు, కాళ్ల గణేష్, కళ్లెం సత్యం, అన్వర్, లడ్డు, సిద్ధిక్, యూనస్, చిట్టిబాబు, భూపతి, పట్టణ అధ్యక్షుడు సందీప్, గాజీ, గంప ప్రసాద్, సురేష్, పబ్లిక్ హెల్త్ సిబ్బంది, మిషన్ భగీరథ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వంగూర్ బిజెపి ఆధ్వర్యంలో 21 కిలోమీటర్ల మహాపాదయాత్ర

**- ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు**

మే -19 ప్రజా దివాన్



నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం వంగూరు మండల భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20 వ తేదీ బుధవారం నాడు 21 కిలోమీటర్ల భారీ మహా పాదయాత్ర నిర్వహించనున్నారు. ఉల్పర గ్రామం నుండి ప్రారంభమై ఈ పాదయాత్ర వరకు దాదాపు 21 కిలోమీటర్ల వరకు ఉదయం 8 గంటల సమయంలో ప్రారంభం కానున్న ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు హాజరుకానున్నారు. ఈ పాదయాత్రలో ప్రధాన డిమాండ్లుగా ఉల్పర వాగుపై తక్షణమే నూతన బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి, అదేవిధంగా ఉల్పర గ్రామం నుండి కల్వకుర్తి వరకు సింగల్ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించి మెరుగుపరచాలి. ఈ సందర్భంగా బిజెపి వంగూరు మండల పక్షులు ఆనంద రెడ్డి మాట్లాడుతూ ఈ పాదయాత్ర కేవలం రాజకీయం కోసం కాదని వంగూర్ మండల ప్రజల కోసం చేస్తున్నామని స్పష్టం చేశారు. ప్రజల హక్కుల కోసం చేస్తున్న ఈ పాదయాత్రలో బిజెపి నాయకులు కార్యకర్తలు అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# సిఐ నాయుడు వారికి ఘన సన్మానం

మే -19 ప్రజా దివాన్

ఎన్టీఆర్ జిల్లా నందిగామ నియోజకవర్గం కంచికచర్ల మండలం రూరల్ సీఐ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సిఐ నాయుడు వారిని శాలువా తో ఘనంగా సన్మానించిన ఎ న్టీఆర్ జిల్లా బిజెపి పార్టీ మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు దేవరకొండ రమాదేవి వైస్ ప్రెసిడెంట్ వాడపల్లి కళ్యాణ్ వీరులపాడు మండల అధ్యక్షుడు పోలా జక్కన్న తదితరులు పాల్గొన్నారు



# రాయుల గండి దేవస్థానంలో సోషల్ ఆడిట్ ఎంక్వయిరీ

**అన్ని వివరాలు అడిగి తెలుసుకున్న ఎంక్వయిరీ ఆఫీసర్ శివకుమార్**

మే -19 ప్రజా దివాస్




నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం ప్రజల మండలం శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి రాయగండి దేవస్థానంలో ఈరోజు దేవాదాయ శాఖ వారు సోషల్ ఆడిట్ ఎంక్వయిరీ చేయడం జరిగింది. ఈ ఆడిట్ ఎంక్వయిరీలో దేవాలయ ప్రధాన అర్చకులు దాశరథి మోహన్ ను గుడికి సంబంధించిన అన్ని వివరాలు (గుడిమాన్యం, గుడికి సంబంధించిన ఆస్తి, హుండీ లెక్కింపులు తదితర వివరాలు) అడిగి తెలుసుకోవడం జరిగింది. దేవాదాయ శాఖ నుండి ఆడిట్ ఎంక్వయిరీకి వచ్చినటువంటి ఆడిట్ ఆఫీసర్ శివకుమార్ మాట్లాడుతూ దేవాలయంలో ప్రతి రోజు పూజలు నిర్వహించాలని అదేవిదంగా దేవాలయానికి సంబంధించిన విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించిన చర్యలు తప్పవని ఆయన పేర్కొన్నారు.

# మామిడి చెట్టు ఎక్కి కిందపడడంతో రైతు మృతి..

మే -19 ప్రజా దివాస్



కామారెడ్డి జిల్లా పరిధిలో విషాద ఘటన చోటుచేసుకుంది. మాచారెడ్డి మండలంలోని పర్డీపేట్ గ్రామంలో విషాద ఘటన జరిగింది. నర్సన్నపల్లి గ్రామానికి చెందిన రాస మోల్ల రాజయ్య (40) అనే రైతు ఫరిద్‌పేట్ శివారులోని తన వ్యవసాయ చేను వద్ద మామిడి చెట్టు ఎక్కిన సమయంలో ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. తీవ్రంగా గాయపడిన రాజయ్యను కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వెంటనే చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రి కామారెడ్డికి తరలించారు. అయితే ఆసుపత్రికి తీసుకొచ్చేసరికి ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందినవాడు. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న రాజయ్య ఆకస్మిక మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల రోదనలు హృదయ విదారకంగా మారాయి. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# అధికర్త యోగి అభియాన్ కార్యక్రమంలో మొక్కలు నాటిన సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి

**- పచ్చదనానికి ప్రాధాన్యం - మొక్కలు నాటిన సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి**
**- ఆదిసేవా కేంద్రం ప్రారంభోత్సవంలో సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి**

మే -19 ప్రజా దివాస్




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం మూకమామిడి గ్రామ పంచాయితీ కార్యాలయంలో మంగళవారం “అధికర్త యోగి అభియాన్” కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదిసేవా కేంద్రం ప్రారంభోత్సవం, గ్రామ స్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి. ముఖ్య అతిథిగా పాల్గొని పంచాయతీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి మాట్లాడుతూ. గ్రామంలో పచ్చదనం పెంచడం మన అందరి బాధ్యత. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క నాటి సంరక్షించాలి. పర్యావరణాన్ని కాపాడుకుంటేనే భవిష్యత్ తరాలకు మంచి జీవనం అందించగలం అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కేసుపాక శ్రీనివాసరావు, అంగన్వాడి మడకం రాధ, గ్రామ పెద్దలు ముత్యం బిక్షం మరియు గడ్డం వెంకటేష్ సున్నం శ్రీను బత్తుల సంజీవరావు కోండ్రు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# సుందరయ్యకు ఘనమైన నివాళి

**- సిపిఎం వనపర్తి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మండ్ల రాజు**

మే -19 ప్రజా దివాస్

సిపిఎం పార్టీ నిర్మత పుచ్చల పల్లి సుందరయ్య 41వ వర్ధంతి నీ సిపిఎం పెబ్బేరు మండల కమిటీ ఆధ్వర్యంలో హమాలీ సంఘం కార్యాలయంలో సిపిఎం నాయకులు ఆర్ భాస్కర్ అధ్యక్షతన నిర్వహించారు . సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మండ్ల రాజు పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మండ్ల రాజు మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య 1913 మే 1న నెల్లూరు జిల్లా అలగానిపాడు లో భూస్వామ్య కుటుంబంలో జన్మించారని భూస్వామ్య వ్యవస్థ రద్దు కోసం, దోపిడి రాజ్యం పెట్టుబడిదారీ సమాజం రద్దు కోసం పనిచేశారని అన్నారు. సోషలిజం స్థాపనకు ఎనలేని కృషి చేశారన్నారు. 1985 మే 19న అనారోగ్యంతో మరణించారన్నారు ఆయన జీవించినంత కాలం నిరాడం వరకు నిరాడంబరతకు పెట్టింది పేరని పార్లమెంటు



ప్రతిపక్ష నాయకుడిగా 1952 నుండి 1954 వరకు, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో 17 సంవత్సరాలు శాసనసభ్యులుగా పని చేశారని తను సైకిల్ పైనే ప్రయాణం చేసే వార నీ కొనియాడారు. కుల వివక్ష అంతం కోసం కుటుంబంతోనే పోరాటం ప్రారంభించి సమాజంలో అంటరానితనానికి వ్యతిరేకంగా ఉద్యమిచారన్నారు. 1932 లోనే అలగానిపాడు లో వ్యవసాయ కార్మిక సంఘం స్థాపించారన్నారు. కార్మికులను, పేదలను దోపిడీకి గురిచేస్తున్న పెట్టుబడి దారి వ్యవస్థను కూల్చి సోషలిజం స్థాపించడమే సుందరయ్య గారికీ ఘనమైన నివాళి అని అన్నారు. భారత దేశంలో సంపద కొంతమంది దగ్గర పోగుబడుతున్నది. 90శాతం మంది పేదలుగా, నిరుపేదలుగా జీవనం కొనసాగిస్తున్నారు . నిరుద్యోగ సైన్యం పెంచి పోషించే వ్యవస్థ పెట్టుబడి దారి వ్యవస్థ అన్నారు. మహిళాలను ఆటబొమ్మలుగా చూయించేది, అత్యాచారాలు జరగడం సహజమే అనే ధోరణి ఈ వ్యవస్థలో ఉన్నదన్నారు . కులం, మతం పేరుతో సమాజాన్ని నిలువున చీల్చింది పెట్టుబడి దారి వ్యవస్థ అని మండి పడ్డారు . పెట్రోల్, డీజిల్, ఆదాచేయండి, బంగారం కొనుగోలు చేయకండి అంటూ స్వయానా ప్రధాని ప్రచారం చేయడం వెనుక దాగివున్న ఉన్న అసలు రహస్యం సంక్షోభమే అన్నారు. పెట్టుబడి దారి వ్యవస్థ ఆర్థిక అసమానతలు, సామజిక, రాజకీయ అసమానతలు పెంచి పోషించే దుర్మార్గపు వ్యవస్థ అన్నారు . ఈ వ్యవస్థ మార్పుకోసం నేటి యువత, కార్మిక వర్గం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలనీ ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఊసన్న హమాలి యూనియన్ అధ్యక్షులు ఆంజనేయులు గంగాధర్ వెంకటేష్ రాజు నరసింహ బిసన్న తదితరులు పాల్గొన్నారు

# జర్నలిస్ట్ జోగు రాములు మరణం తీరని లోటు

**- ఐజేయు రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్**

మే -19 ప్రజా దివాస్

వనపర్తి జిల్లాలోని గోపాల్ పేట మండలంలో వెలుగు దినపత్రిక జర్నలిస్టుగా ప్రజా సమస్యల కోసం నిరంతరం పరితపిస్తూ పనిచేస్తున్న జోగు రాములు అకాల మరణం జర్నలిస్ట్ లోకానికి తీరని లోటని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ టియుడబ్ల్యూజే ,(ఐజేయు) రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధు గౌడ్ తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వెలుగు దినపత్రిక జర్నలిస్ట్ మరణం తెలిసిన వెంటనే రాష్ట్ర కార్యదర్శి వెంట తెలంగాణ టియుడబ్ల్యూజే (ఐజేయు) నాయకులు వనపర్తి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మాధవరావు, రాజు, రాష్ట్ర హౌసింగ్ సైట్స్ మెంబర్ శ్రీనివాసరావు ఈశ్వర్, తదితరులు మరణించిన జర్నలిస్టు జోగు రాములు కుటుంబాన్ని పరామర్శించి జర్నలిస్టు సంఘం తరపున రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ తో చర్చించి తగిన న్యాయం చేసి ఆర్థికంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని వనపర్తి, నాగర్ కర్నూల్, గద్వాల, నారాయణపేట, మహబూబ్ నగర్ జిల్లాలో జర్నలిస్టులు వృత్తిపరంగా అనేక ఒత్తిళ్లకు గురవుతూ ఉండే పోటు మరణాలు, దయాబెటిస్, రోడ్డు ప్రమాదాలతో మరణిస్తున్న సంఘటనలు జీర్ణించుకోలేక పోతున్నామని వెంటనే వృత్తిలో కొనసాగుతూ కారణాలతో మరణిస్తున్న జర్నలిస్టులను తెలంగాణలో అతిపెద్ద జర్నలి (ఐజేయు )జర్నలిస్టు సంఘం ఆదుకుంటుందని రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధు గౌడ్ తెలిపారు. ఇప్పటికే అనేక జర్నలిస్టు కుటుంబాలను తెలంగాణ టియుడబ్ల్యూజే (ఐజేయు) యూనియన్ తరపున అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తూ ఆదుకున్న



సంగతి గుర్తు చేశారు. జర్నలిస్టులు ఆత్మ ధైర్యం కోల్పోకుండా వృత్తి ధర్మాన్ని ఆత్మస్థైర్యంతో ముందుకు నడపాలని ఎవరు కూడా భయపడవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. అనేక సమస్యలు ఉన్నప్పటికీ ఆరోగ్యపరంగా విద్యాపరంగా వైద్య పరంగా అన్ని రంగాల్లో ( ఐజేయు )జర్నలిస్టు సంఘం ఆదుకుంటుందని ఆ విషయం ప్రతి ఒక్క జర్నలిస్టు గుర్తు పెట్టుకోవాలని సూచించారు. మృతి చెందిన జోగు రాములు కుటుంబాన్ని పరామర్శించారు.

# బహుజన దమ్మపేట మండల పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ సమావేశం

మే -19 ప్రజా దివాస్

దమ్మపేట మండలం చిన్న గొల్లగూడెం పాస్టర్ జెకార్య ప్రార్థన మందిర ఆవరణంలో మండల కమిటీ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం క్రైస్తవుల ఐక్యతను చాటుతూ, పాస్టర్ల మీద, క్రైస్తవుల మీద జరుగుతున్న మత పరమైన దాడుల విషయమై ఇటీవల పాడేరు నియోజకవర్గంలో అభినయ దర్శన్ పాస్టర్ మీద కొంతమంది మత చాంధస్సువాదులు కళ్లల్లో కారం చల్లి, కత్తులతో దాడి చేసి, చంపాలనే దుశ్చర్యను బహుజన దమ్మపేట మండల పాస్టర్స్ ఫెలోషిప్ తరుపున తీవ్రంగా ఖండించడం జరిగింది. ఈ సమావేశంలో బండారు జాన్, మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వం కలిగిన భారతదేశంలో



ఇలాంటి మతపరమైన దాడులు జరగడం సిగ్గుచేటని, ఇలాంటి దాడులను తీవ్రంగా ఖండించడం జరిగింది. రమేష్ జాషువా మాట్లాడుతూ ఇలాంటి మతపరమైన దాడులకు, విద్వేషాలకు కారణమైన వారినీ ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇలాంటి చర్యలపై దృష్టి సారించి, క్రైస్తవులకు, పాస్టర్లకు, క్రైస్తవ సమాజానికి అండగా నిలబడాలని కోరడం జరిగింది. క్రైస్తవులు, పాస్టర్లు శాంతి, సమాధానం కోసం, సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేసే మనస్తత్వం కలిగిన మాపై ఇలాంటి దాడులు సబబు కాదని హితవు పలికారు. ఈలాంటి దుశ్చర్యలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు, అధికారులు, నాయకులు, ప్రజా ప్రతినిధులు క్రైస్తవులకు అండగా నిలబడాలని కోరడం జరిగింది. ఈ సమావేశంలో బహుజన దమ్మపేట మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు సెబాస్టియన్, సెక్రటరీ క్రాంతి కుమార్, కమిటీ పెద్దలు దైవ ప్రసాద్, యేసురత్నం, లారెన్స్, తిమోతి, జెకర్యా, ఇశ్రాయేలు, మార్క్ రాజు, తిమోతి, రాధాకృష్ణ, నతానియేలు, తితుకు, బోయజు, రాజేంద్ర ప్రసాద్, రమణ, యోసేపు, బహుజన మండల పాస్టర్స్ పాల్గొన్నారు..

# స్కూల్ బస్సులకు ఫిట్నెస్ లేకపోతే సీజ్ చేయాలని ఆదేశాలు

**- డిటిఓ బాలు నాయక్ కఠిన హెచ్చరిక**

మే -19 ప్రజా దివాస్

నాగర్ కర్నూల్ జిల్లాలో పాఠశాల బస్సుల ఫిట్నెస్ మరియు విద్యార్థుల భద్రతపై రవాణా శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న అన్ని ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులకు సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలని నిబంధనలు చర్యలు తప్పవని జిల్లా రవాణాశాఖ అధికారి బాలు నాయక్ హెచ్చరించారు. జిల్లా మొత్తంలో 190 బస్సులు ఉండగా తనిఖీల్లో 54 బస్సులు క్రిస్మస్ పరీక్షలకు హాజరయ్యాయని వెల్లడించారు. కాలం తీరిన మరియు ఫిట్నెస్ లేని బస్సులు రోడ్డు ఎక్కిన తక్షణమే సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రతి స్కూల్ బస్సు పసుపు రంగులో ఉండి సిటింగ్ సామర్థ్యానికి మించి విద్యార్థులను ఎక్కించుకోకూడదని తెలిపారు. ఏ విధంగా ప్రతి బస్సులో ఫస్ట్ యాడ్ కిట్, ఇన్సూరెన్స్ పొల్యూషన్ సర్టిఫికెట్లు కలిగి ఉండాలని తెలిపారు. బస్సు నడిపే డ్రైవర్లకు హెవీ లైసెన్స్ తో పాటు ఐదు సంవత్సరాల అనుభవం ఉండాలని సూచించారు. స్కూల్ యజమాన్యాలు ప్రతినెల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించాలని, డ్రైవర్, క్లీనర్ భద్రత అవగాహన సదస్సులకు హాజరుకావాలని డిటిఓ ఆదేశించారు. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటాలాడితే వదిలిపెట్టేది లేదని బాలు నాయక్ హెచ్చరించారు.



# తాడ్వాయిలో చిరుత దాడి కలకలం..

**– మూడు లేగదూడలు మృతి, గ్రామస్తుల్లో భయాందోళనలు**

మే -19 ప్రజా దివాస్

తాడ్వాయి మండలంలోని సందివాడ పరిధిలోని నామదుబ్బ తండాలో ఆదివారం అర్ధరాత్రి చిరుత సంచారం కలకలం రేపింది. గ్రామ శివారులో ఉన్న పశువుల పాకపై చిరుత దాడి చేసి మూడు లేగదూడలను చంపివేయడంతో గ్రామస్తులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. రాత్రి వేళ జరిగిన ఈ ఘటనతో తండావాసులు ఒక్కసారిగా బయటకు పరుగులు తీశారు.బాధితుడు రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటి పక్కనే ఉన్న పశువుల పాకలో కట్టివేసిన లేగదూడలపై అర్ధరాత్రి సమయంలో చిరుత ఒక్కసారిగా దాడి చేసింది. దాడిలో రెండు లేగదూడలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో దూడను కొంత దూరం ఈడ్చుకెళ్లి హతమార్చింది. ఉదయం పశువులను చూసేందుకు వెళ్లిన కుటుంబ సభ్యులు రక్తపు మరకలు, మృతదేహాలు కనిపించడంతో షాక్‌కు గురయ్యారు.ఈ ఘటన సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని భయాందోళనలు వ్యక్తం చేశారు. ఇటీవల అడవి ప్రాంతాల నుంచి చిరుతలు గ్రామాల వైపు వస్తుండటంతో ప్రజలు రాత్రి వేళ బయటకు రావడానికి కూడా భయపడుతున్నామని వాపోయారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, పశువుల భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గ్రామస్తులు వెంటనే అటవీ



శాఖ అధికారులు స్పందించి చిరుత సంచారాన్ని నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని, బాధిత రైతుకు తగిన నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే గ్రామ పరిసర ప్రాంతాల్లో బోన్లు ఏర్పాటు చేసి చిరుతను పట్టుకోవాలని కోరుతున్నారు.

# బక్రీద్ పండుగ సందర్భంగా శాంతి కమిటీ సమావేశం.



మే -19 ప్రజా దివాస్

బక్రీద్ పండుగను పురస్కరించుకొని మద్దూరు పోలీస్ స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి బి రమేష్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ చేర్యాల, ఏండి ఆసిఫ్ ఎస్ఐ మద్దూరు పిఎస్, వివిధ మత పెద్దలు, గ్రామ పెద్దలు మరియు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.సమావేశంలో బక్రీద్ పండుగ సందర్భంగా శాంతి భద్రతలను కాపాడేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించబడింది. పండుగ వేళల్లో పరస్పర గౌరవం, సామరస్యాన్ని కాపాడాలని, ఎలాంటి అపోహలు, వదంతులు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ప్రజలు చట్టాలను గౌరవిస్తూ, శాంతియుతంగా పండుగను జరుపుకోవాలని పోలీస్ అధికారులు కోరారు. ఎలాంటి అనుమానాస్పద పరిస్థితులు గమనించినా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.పోలీస్ శాఖ ప్రజల సహకారంతో పండుగను శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

# జోగిపేట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సన్మానించిన ఐ ఫౌండేషన్



మే -19 ప్రజా దివాస్

ఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్ర భారతి లో జరిగిన ఒక కార్యక్రమంలో 10వ తరగతి 2026 పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల జోగిపేటకు చెందిన బి .శ్రీజ, అలిన, వై .సుహాసిని, బి .సుప్రియ, డి .నందిని బి వైష్ణవి లకు సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి జి . రజితలీల పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులకు అభినందనలు తెలిపినారు.

# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం





మే -19 ప్రజా దివాస్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం లోని జగన్నాధపురం గ్రామం లో ఘనంగా జరిగింది. కార్యక్రమం లో డాక్టర్ కృష్ణ తేజ, శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ విశ్వ విద్యాలయం వారు ఇచ్చిన ఆరు ముఖ్యంశాలతో పాటు కొన్ని అంశాలు వివరించారు. రైతులు విలువ ఆధారిత ఉత్పత్తులను రైతు సహకార సంఘాల ద్వారా విక్రయించుకుంటే మంచి ధర ని పొందవచ్చని, రైతు కేవలం ఒక వ్యవసాయదారుడిగా కాకుండా ఒక వాటాదారుడిగా ఆలోచించాలని చెప్పారు.సేంద్రీయ ధృవీకరణ, తక్కువ నీటి తో పండే ఉద్యాన పంటల గురించి చర్చించారు.ఈ కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి బి.అరుణ్ బాబు మరియు వ్యవసాయ విస్తరణ అధికారి పీ.రమేష్ పాల్గొన్నారు

# అల్పాహారం పంపిణీ చేసిన సర్పంచ్ శైలజ శివశంకర్.



నమస్తే ఇందూర్

వీరన్నపేట గ్రామంలో ఉపాధి హామీ కార్మికులకు సర్పంచ్ శైలజ శివశంకర్ ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఎండ తీవ్రతలో గ్రామ అభివృద్ధి పనుల్లో శ్రమిస్తున్న కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధిలో ఉపాధి హామీ కార్మికుల పాత్ర ఎంతో ముఖ్యమైందని తెలిపారు. కార్మికుల ఆరోగ్య రక్షణ కోసం గతంలో కూడా మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఎండ వేడిమి కారణంగా వడదెబ్బ తగలకుండా కార్మికులు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి మరియు ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

# ఇంటర్ లో ఉత్తమ ప్రదర్శన కనబర్చిన విద్యార్థినిని సన్మానించిన ఎస్పీ



మే -19 ప్రజా దివాస్

సంగారెడ్డి ఇంటర్మీడియట్ పరీక్షల్లో 99.31 శాతం మార్కులతో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రదర్శన కనబర్చిన విద్యార్థిని సాహిత్య ను జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్ అభినందిస్తూ ప్రశంసా పత్రాన్ని అందచేశారు. ఆదివారం నాడు పోలీసు కుటుంబాలకు చెందిన పిల్లల ప్రతిభను ప్రోత్సహిస్తూ, వారి విద్యా ప్రగతికి తోడ్పడాలనే ఉద్దేశ్యంతో నిర్వహించిన "స్పార్క్-(సపోర్టింగ్ పొటెన్షియల్ అకడమిక్ రైజ్ ఫర్ ఖాకీ కిడ్స్)" కార్యక్రమంలో సంగారెడ్డి పట్టణానికి చెందిన భాగ్యలక్ష్మి శామ్ కుమార్ గౌడ్ దంపతుల కుమార్తె సాహిత్య ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఇదే పట్టుదలతో తన విద్యాభ్యాసాన్ని కొనసాగించి, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. ఉత్తమ ప్రతిబ కనబర్చిన పోలీసుల పిల్లలను జిల్లా ఎస్పీ అభినంచడం పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌పై మహబూబ్ నగర్ ట్రాఫిక్ పోలీసుల కఠిన చర్యలు ఒకరికి జైలు శిక్ష.



మే -19 ప్రజా దివాస్

మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కె.రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో బైపాస్ రోడ్డు నందు డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 8 మంది ద్విచక్ర వాహనదారులను ట్రాఫిక్ పోలీసులు గుర్తించి కేసులు నమోదు చేశారు. అనంతరం వారిని సోమవారం 18.05.2026న సెకండ్ క్లాస్ కోర్టు న్యాయమూర్తి శ్రీ ఆర్. శశిధర్ గారి ఎదుట హాజరుపర్చగా, అందులో 7 మందికి ఒక్కొక్కరికి రూ.1000/- జరిమానా విధించబడింది.అలాగే ఒక ద్విచక్ర వాహనదారునికి 3 రోజుల జైలు శిక్ష విధిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది.మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉంటుందని, ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు.

# ఉత్తర తెలంగాణపై వడగాలుల ముప్పు

**– జగిత్యాలతో పాటు 6 జిల్లాలకు హెచ్చరిక.**

ఉత్తర తెలంగాణ జిల్లాలపై వడగాలుల ముప్పు పొంచి ఉందని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (టీజీఐసీసీసీ) హెచ్చరించింది. రాబోయే 24 గంటల్లో ఆదిలాబాద్, జగిత్యాల, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో అక్కడక్కడా తీవ్ర వడగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది.ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసర పరిస్థితులు తప్ప బయటకు రావద్దని హెచ్చరించారు.చిన్నపిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు.తగినంత నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ వంటి ద్రవ పదార్థాలు తీసుకోవాలని, తలకు గుడ్డ లేదా టోపీ ధరించి బయటకు వెళ్లాలని సూచించారు. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని అధికారులు తెలిపారు.




# కాఫీకప్పులో తుఫాన్

## కురుప్పులో విజయ్ అంటూ..ప్రచారం

సూర్య, త్రిష ప్రధాన పాత్రల్లో ఆర్‌జే బాలాజీ తెరకెక్కించిన చిత్రం 'కరుప్పు' తెలుగులో వీరభద్రుడుగా తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా ఆదరణ సొంతం చేసుకుంటోంది. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ మూవీకి సంబంధించిన ఓ ఆసక్తికర విషయం వైరల్ అవుతోంది. ఇందులో విజయ్ నటించారంటూ ఓ వీడియో తెగ చక్కర్లు కొడుతోంది. ఈ చిత్రంలో లోకేశ్ కనగరాజ్ తెరకెక్కించిన సూపర్ హిట్ మూవీ 'లియో' చిత్రానికి సంబంధించిన రిఫరెన్స్ ఉన్నట్లు నెటిజన్లు గుర్తిస్తున్నారు. 'కరుప్పు'లో వచ్చే ఒక సన్నివేశంలో ఎవరో కాఫీ పెడుతున్నట్లు చూపిస్తారు. అయితే ఆ కాఫీ పెడుతున్న వ్యక్తి మరెవరో కాదు.. 'లియో' సినిమాలోని పార్థిబన్ (విజయ్) క్యారెక్టరేనని ఊహించుకుంటున్నారు. పైగా ఈ సన్నివేశానికి ముందు కాఫీ షాప్‌లో సర్వర్.. 'నీకు స్పెషల్ లియో కాఫీ తెస్తాను' అనడం.. అక్కడ కాఫీ పెడుతోన్న వ్యక్తిని వెనక నుంచి మాత్రమే చూపించడంతో అందరూ విజయ్ అతిథి పాత్రలో నటించారా! అని మాట్లాడుకుంటున్నారు. ఇక్కడ మరో ఆసక్తికర విషయం ఏమిటంటే.. కాఫీ షాప్ సన్నివేశంలో కనిపించిన శాండీ, జననీ ఇద్దరూ విజయ్ 'లియో'లోనూ కాఫీషాప్ సీన్‌లో నటించారు. ఈ సన్నివేశంపై నెటిజన్లు ఆసక్తికర కామెంట్స్ పెడుతున్నారు. 'ఈ సీన్ వచ్చినప్పుడు థియేటర్ అరుపులతో దద్దరిల్లింది' అని ఒకరు అనగా.. కరుప్పు' సినిమాలో ఆ కాఫీ కప్పు, ఆ మేకింగ్ స్టైల్ చూస్తుంటే కచ్చితంగా అది 'లియో' సినిమాలోని పార్థిబన్ కేఫ్ రిఫరెన్సే. ఆర్జే బాలాజీ నిజంగానే గట్టి ప్లాన్ చేశారు అని మరో నెటిజన్ కామెంట్ పెట్టారు.

# వచ్చే ఏడాది శక్తిశాలిని?


మడాక్ హారర్ కామెడీ యూనివర్స్ ఫ్రాంచైజీ భాగంలో రాబోతున్న తదుపరి చిత్రం 'శక్తి శాలిని'. 'సైయారా' సినిమా విజయంతో బాలీవుడ్‌లో మంచి క్రేజ్‌ని సొంతం చేసుకున్న కథానాయిక అనీత్ పడ్డా ఇందులో ప్రధాన పాత్రలో నటిస్తుంది. ఈ చిత్రానికి ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాని వచ్చే ఏడాది జనవరిలో థియేటర్లలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ప్రణాళిక చేస్తోందట చిత్రబృందం. ఈ సినిమా చివరి షెడ్యూల్ చిత్రీకరణ ముంగింపు దశలో ఉందని.. ఆ వెంటనే పోస్ట్ ప్రొడక్షన్ పనులు ప్రారంభించనుందని తెలిసింది. అనీత్ పడ్డా ఈ చిత్రంలో ద్విపాత్రాభినయంలో కనిపించనుందని సమాచారం. మంచి, చెడుల మధ్య జరిగే శాశ్వత పోరాటం చుట్టూ ఈ చిత్రం తిరుగుతుందని జోరుగా ప్రచారం జరుగుతుంది. ఈ ఫ్రాంచైజీని మునుపటి కంటే గాఢమైన కథాంశంతో ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యంతో ఈ చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నారట.



# పెద్దికి సెన్సార్ క్లీయరెన్స్

## 3గంటల రన్ టైమ్ అంటూ ప్రచారం


రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సన దర్శకత్వంలో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న పాన్ ఇండియా రస్టిక్ స్పోర్ట్స్ డ్రామా పెద్ది విడుదలకు సిద్ధమవుతోంది. వృద్ధి సినిమాస్ పతాకంపై నిర్మాత వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం తాజాగా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుని విడుదల దిశగా మరో అడుగు ముందుకు వేసింది. చిత్రానికి సెన్సార్ బోర్డు నుంచి అధికారిక క్లియరెన్స్ లభించినట్లు సమాచారం. దీంతో పాటు ఈ సినిమాకు సంబంధించిన రన్‌టైమ్, సెన్సార్ టాక్ ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. సాధారణంగా ప్రస్తుతం కమర్షియల్ చిత్రాలు రెండున్నర గంటల లోపే ఉండేలా దర్శకులు ప్లాన్ చేస్తున్నారు. అయితే 'పెద్ది' విషయంలో దర్శకుడు బుచ్చిబాబు కథపై పూర్తి నమ్మకంతో భారీ నిడివిని ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది. ఈ చిత్రం దాదాపు




3 గంటల 9 నిమిషాల (189 నిమిషాలు) రన్‌టైమ్‌తో సెన్సార్ పూర్తి చేసుకుందని సమాచారం. రంగస్థలం తర్వాత రామ్ చరణ్ కెరీర్‌లో ఇంతటి సుదీర్ఘ నిడివితో వస్తున్న సినిమా ఇదే కావడం విశేషం. సినిమాలోని భావోద్వేగాలు, యాక్షన్ ఎలిమెంట్స్, కథలోని తీవ్రత ప్రేక్షకులను మొత్తం ప్రయాణంలో కట్టిపడేస్తాయని చిత్ర బృందం ధీమాగా ఉంది. ఎక్కడా కథ నెమ్మదించకుండా స్క్రీన్‌ప్లేను బుచ్చిబాబు ప్రత్యేకంగా డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. ఈ చిత్రం 1980ల కాలం నాటి గ్రామీణ నేపథ్యంలో సాగే పవర్‌ఫుల్ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కింది. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే జీవన విధానం, క్రీడా సంస్కృతి, మనుషుల మధ్య ఉన్న భావోద్వేగాలు, పంతాలు, పట్టింపులను కథలో ప్రధానాంశాలుగా తీసుకున్నట్లు సమాచారం. ఈ సినిమాలో రామ్ చరణ్ పూర్తిగా కొత్త రస్టిక్ లుక్‌లో కనిపించనున్నారు. పాత్ర కోసం ఆయన తన శరీరాకృతిని కూడా ప్రత్యేకంగా మార్చుకున్నట్లు ఇప్పటికే విడుదలైన పోస్టర్లు స్పష్టం చేశాయి. ఈ లుక్‌కు అభిమానుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. సెన్సార్ బృందం నుంచి కూడా సినిమాకు మంచి స్పందన వచ్చినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా రామ్ చరణ్ నటన, బుచ్చిబాబు మేకింగ్, సినిమాలోని ఎమోషనల్ కంటెంట్ ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయని టాక్ వినిపిస్తోంది. కేవలం యాక్షన్ మాత్రమే కాకుండా కథలోని భావోద్వేగాలు ప్రేక్షకులను కదిలించే స్థాయిలో ఉంటాయని కూడా సమాచారం.

# కేన్స్‌లో అదితి మెరుపులు

ఫ్యాషన్, సినీరంగంలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే కేన్స్ చిత్రోత్సవాలు సినీతారల సందడిల మధ్య అంగరంగ వైభవంగా జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే పలువురు భారతీయ నాయికలు ఈ వేడుకలో తళుక్కున మెరిసి ఆకట్టుకున్నారు. ఇందులో భాగంగానే తాజాగా కథానాయిక అదితీ రావ్ హైదరీ కేన్స్ వేడుకలో అడుగుపెట్టింది. గౌను ధరించి రెడ్‌కార్పెట్‌పై హొయలొలికించి.. సినీప్రియుల దృష్టిని ఆకర్షించింది అదితి. ఈ నేపథ్యంలోనే 'మేము దీనికి పూర్తిగా అర్హులం. కేన్స్ స్టేట్ ఆఫ్ మైండ్' అనే క్యాప్షన్‌తో దీనికి సంబంధించిన ఫొటోలను సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుందామె. ఇక సినిమాల విషయానికొస్తే.. 'ఓ సాథి రే', 'పరివారిక్ మనురంజన్' లాంటి చిత్రాలతో బిజీగా ఉంది అదితి.



## కొరటాల, బాలయ్య కాంబో

# ఆసక్తికర అప్‌డేట్లతో చిత్రసీమలో హాట్ టాపిక్



టాలీవుడ్‌లో భారీ అంచనాలు నెలకొన్న కాంబినేషన్లలో ఒకటిగా మారిన నటసింహం నందమూరి బాలకృష్ణ దర్శకుడు కొరటాల శివ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఆసక్తికర అప్‌డేట్లు ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఈ క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కబోయే సినిమా కోసం బాలయ్య సరికొత్త మేకోవర్‌లో కనిపించనున్నారనే వార్త అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. సినీ వర్గాల సమాచారం ప్రకారం, ఈ చిత్రంలోని సెకండ్ హాఫ్‌లో వచ్చే కీలక ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ కోసం బాలకృష్ణ పూర్తిగా కొత్త లుక్‌లో కనిపించనున్నారట. ముఖ్యంగా ఈ పాత్ర కోసం ఆయన హెయిర్ స్టైల్‌లో ప్రత్యేక మార్పులు చేయనున్నట్లు తెలుస్తోంది. సెలబ్రిటీ హెయిర్ స్టైలిస్ట్ ఆలిమ్ హాకిమ్ ప్రత్యేకంగా బాలయ్య కోసం కొత్త హెయిర్ డిజైన్ రూపొందిస్తున్నట్లు సమాచారం. కేవలం హెయిర్ స్టైల్ మాత్రమే కాదు, బాలకృష్ణ డ్రెస్సింగ్ స్టైల్‌లో కూడా మార్పులు చేయనున్నారని టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు అభిమానులు చూడని విధంగా అల్ట్రా స్టైలిష్ మాస్ లుక్‌లో నటసింహం కనిపించబోతున్నారనే టాక్ వినిపిస్తోంది. ఇక ఈ చిత్రం షూటింగ్ విషయానికి వస్తే, ఆగస్టు నెలలో సినిమా సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉందని తెలుస్తోంది. మొదటి షెడ్యూల్‌ను భారీ యాక్షన్ సీక్వెన్స్‌తో ప్రారంభించేందుకు మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నట్లు సమాచారం. యాక్షన్‌తో పాటు భావోద్వేగాలకు కూడా ఈ సినిమాలో సమాన ప్రాధాన్యం ఉండబోతుందని తెలుస్తోంది. ముఖ్యంగా ఈ చిత్రంలో ఫ్యామిలీ ఎమోషన్స్ కీలకంగా ఉండనున్నాయని, కొరటాల శివ తన స్టైల్‌కు తగ్గట్టుగానే బలమైన సందేశంతో కూడిన కథను సిద్ధం చేశారని టాక్ వినిపిస్తోంది. దేవర తర్వాత కొరటాల తెరకెక్కిస్తున్న సినిమా కావడంతో కథ విషయంలో ఆయన చాలా సమయం తీసుకుని కసరత్తు చేసినట్లు తెలుస్తోంది. ఇక నిర్మాణ బాధ్యతలను నిర్మాతలు సుధాకర్ చెరుకూరి, సుధాకర్ మిక్కిలినేని సంయుక్తంగా నిర్వహిస్తున్నారు. బాలయ్య ఇప్పటికే వరుస విజయాలతో ఫుల్ ఫామ్‌లో ఉండగా, కొరటాల శివతో మొదటిసారి జతకట్టడం వల్ల ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. మాస్ ఎలిమెంట్స్, ఎమోషన్స్, స్టైలిష్ ప్రెజెంటేషన్ కలిస్తే ఈ సినిమా మరో భారీ హిట్‌గా నిలుస్తుందా అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది.

## డేటింగ్‌లో శ్రీలీల, తిలక్‌వర్మ రూమర్స్‌ను ఖండించిన తల్లి స్వర్ణలత

నటి శ్రీలీల, క్రికెటర్ తిలక్ వర్మ డేటింగ్‌లో ఉన్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ వార్తలు జోరందుకున్నాయి. దీంతో శ్రీలీల తల్లి స్వర్ణలత వాటిని ఖండిస్తూ శ్రీలీల పెళ్లికి ఇంకా సమయం ఉందని చెప్పారు. సోషల్ మీడియాలో వస్తోన్న వార్తలు పూర్తిగా అవాస్తవం, నిరాధారం. ఇలాంటి కథలు ఎలా పుట్టుకొస్తాయో తెలియట్లేదు. ఈ వార్తలలో అణువంత కూడా నిజం లేదు. శ్రీలీల ప్రస్తుతం తన చదువు, యాక్టింగ్‌లో బిజీగా ఉంది. ఏ మాత్రం విరామం దొరికినా నీట్-పీజీ ఎగ్జామ్‌కు ప్రిపేర్ అవుతోంది. ఇలాంటి వ్యక్తిగత విషయాల గురించి ఆలోచించడానికి ఆమెకు మరో ఐదారు సంవత్సరాల సమయం ఉందని స్పష్టతనిచ్చారు. 2025 డిసెంబర్‌లో శ్రీలీల-తిలక్ ఇద్దరూ తిరుమలను సందర్శించడం, వాంఖడే టీ20 మ్యాచ్‌లో నటి సందడి చేయడం.. ఇవి రెండూ ఉద్దేశపూర్వకంగా జరగలేదని ఆమె అన్నారు. వాటి ఆధారంగా కథలు అల్లుకుపోవద్దని కోరారు. గతంలో కూడా శ్రీలీలపై ఇలాంటి వార్తలు వచ్చినప్పుడు స్వర్ణలత ఖండించారు. బాలీవుడ్ నటుడు కార్తిక్ ఆర్యన్‌తో ఆమె రిలేషన్‌లో ఉన్నట్లు బీటౌన్‌లో కథనాలు రాగా వాటిని ఖండించారు. కార్తిక్ ఆర్యన్ తల్లి, నేనూ ఇద్దరం గైనకాలజిస్టులం. మా వైద్య నేపథ్యం కారణంగా వృత్తిపరంగా కలుసుకుంటాము. దురదృష్టవశాత్తూ.. అందరూ శ్రీలీల, కార్తిక్‌లకు రిలేషన్ ఉందని రాయడం మొదలుపెట్టారని ఖండించారు.